



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సివిల్, ఏఆర్, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ శుక్రవారం పోలీస్ సంక్షేమ దివాస్ కార్యాక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు సిబ్బంది వచ్చి తమ సమస్యలపై వినతులను ఎస్పీకి అందించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ త్వరితగతిన వాటిని పరిష్కరిస్తామని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఉత్సాహంగా..

పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరు గుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల(ఏపీఆర్‌జేసీ) రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం రెండో రోజు హోరా హోరీగా సాగాయి.



ఉమ్మడి కుటుంబం.. విచ్ఛిన్నం

ఉమ్మడి కుటుంబాలు దాదాపు కనుమరుగయ్యాయి. మూడు.. నాలుగు తరాల బంధుత్వాలతో కళకళలాడే ఇళ్లు నేడు వెలవెలబోతున్నాయి. పట్టణాల్లోనే కాదు పల్లెల్లో సైతం ఇదే పరిస్థితి.

6

టీచర్స్ ఓటు.. హక్కులకు చోటు!



- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ
- ఇంటింటికీ ఓటరు స్లిప్‌లు.. మోడల్ బ్యాలెట్‌లు
- హక్కులు సాధిస్తామంటూ ఎవరంతట వారు ప్రచారం
- గడువు దగ్గరపడడంతో పాఠశాలలకు వెళ్లి అభ్యర్థుల వేడుకోలు
- బహుమతులంటూ భారీగా వదంతులు

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు వేడెక్కింది. వివిధ సంఘాల మధ్య నువ్వానేనా అన్నట్టుగా పోటీ నెలకొంది. గతంలో గెలిచిన స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునే దిశగా యూటీఎఫ్ అన్ని పావులు కదిపింది. ఇంకోవైపు వివిధ సంఘాలు బలపరిచిన ఎస్టీయూ అభ్యర్థి గంధం నారాయణరావు ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నిస్తున్నారు. పోటీలో ఉన్న మరి కొంతమంది అభ్యర్థులు ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలంటే తమకు మద్దతు ఇవ్వాలంటూ విస్తృత ప్రచారానికి దిగారు.

-ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గడువు దగ్గరపడింది. పట్టుమని ఐదు రోజుల సమయం లేకపోవడంతో రంగంలో ఉన్న అభ్యర్థులంతా ప్రచారంలో వేగాన్ని పెంచారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వచ్చేనెల 5వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మిగిలి ఉన్న అతి తక్కువ సమయంలోనే ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని యూనియన్లు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా యూటీఎఫ్ అభ్యర్థి సాబ్జీ గెలుపొందారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. సాధారణ ఎన్నికలను తలపించేలా ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం మారింది. ఈ పరిస్థితుల్లో ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోను ఎవరైనా అభ్యర్థులు బహుమతులు ఇవ్వక పోతారా.. అనే సందిగ్ధత ఓటర్లలో ఉంది. పోలింగ్ జరిగే 5వ తేదీకి 48 గంటలు ముందుగానే ఒకరిద్దరు అభ్యర్థులు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులకు బహుమతులు అందజేయనున్నా రంటూ ఇప్పటికే ప్రచారం వేడెక్కింది. గత అనుభవాలను పోల్చుకుంటే 2007, 2009లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాయిలాలు పంచారు. ఎవరు వద్దన్నా, కావాలన్నా లెక్క చేయకుండా వెండి వస్తువులను ఓటర్లకు ఎరవేశారు. విధాన పరిషత్ తిరిగి 2007లో పునరుద్ధరించిన తర్వాత ఇప్పుడు ఐదవసారి ఎన్నికలు జరుగుతున్నాయి. 2007లో శేషారెడ్డి, 2009లో చైతన్యరాజు, 2015లో రాము సూర్యారావు, 2021లో సాబ్జీ ఉమ్మడి గోదా వరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా గెలుపొందారు. అప్పటి ఎన్నికల వాతావరణం ఊహించని రీతిలో బహుమతుల వైపు మళ్ళింది. కాని ఈసారి రంగంలో ఉన్న అభ్యర్థులు ఉపాధ్యాయ హక్కుల కోసమే తాము పోరాడుతున్నట్టు, అందుకే తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో గోపీమూర్తి, వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు, దీపక్, నారాయణరావు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ ఐదుగురు ఉపాధ్యాయ ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.



పాఠశాలలో ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్న గోపీమూర్తి

ఇంటింటికీ ఓటర్ల స్లిప్‌లు..

ఎన్నికలు జరిగేందుకు కేవలం ఐదు రోజుల సమయమే మిగిలి ఉండడంతో అభ్యర్థులంతా ప్రచారంలో ఊపు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. యూటీఎఫ్‌తో పాటు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, బహుజన టీచర్స్ అసోసియేషన్, కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్, గవర్నమెంటు లెక్చరర్స్ అసోసియేషన్, ఏపీటీఎఫ్-1936, పీఆర్టీయూ యూనియన్లకు చెందిన టీచర్ల మద్దతుతో గోపీమూర్తి ప్రచారంలో కాస్త వేగంగానే ముందుకు వెళ్తున్నారు. ఆయన పక్షాన వామపక్షాలకు చెందిన నేతలు దగ్గరుండి ఎన్నికల తతంగాన్ని నడుపుతున్నారు. ఇప్పటికే సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో ఓటరు లిస్టులను ఆయా ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి మరీ అందిస్తున్నారు. యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి రెండుసార్లు వరుస విజయాలు సాధించడంతో ఈసారి ఎలాగైనా ఆ ఆనవాయితీని తప్పించాలని మిగతా యూనియన్లు పట్టుదలతో ప్రచారం సాగిస్తున్నాయి. ఎమ్మెల్సీ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దరిమిలా జరుగుతున్న ఈ ఎన్నికలు మరోమారు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు యూటీఎఫ్‌తో పాటు మిగతా యూనియన్లు సర్వశక్తులు ఒడ్డి ప్రచారంలో ముందు వరుసలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఏలూరులోనే 40 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. జిల్లా మొత్తం మీద 2,667 మంది ఓటర్లు ఉండగా ఇక్కడే అత్యధికులు ఓటర్లు అందుబాటులో ఉండడంతో ఏలూరువైపే అభ్యర్థులంతా ప్రధానంగా దృష్టి నిలిపారు. వీలు చిక్కినప్పుడల్లా పాఠశాల విరామ సమయంలో ఉపాధ్యాయులను కలుసుకుని మద్దతు అభ్యర్థిస్తున్నారు. తమకు ఓటర్ల మద్దతు దక్కేలా ప్రచారంలో టీచర్ల సెలవుల అంశాన్ని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఎటువంటి హక్కుల భంగం ఉపాధ్యాయులు ఎదుర్కొకుండా చూస్తామంటూ హామీలు గుప్పిస్తున్నారు.

శాఖల వారీగా లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో వారి శాఖల ప్రణాళిక లక్ష్య సాధనపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా శాఖల ప్రణాళిక అమలులో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందు స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీఎంహెచ్‌వో డా.శర్మిష్ఠ, డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా, పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాస్, కమిషనర్ భాను ప్రతాప్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

- ఒకరోజు ముందుగానే డిసెంబరు పింఛన్లు
- జిల్లాలో 2,62,836 మంది లబ్ధిదారులు
- రూ.112.68 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు

ఏలూరుసిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఒకరోజు ముందుగానే ఇంటింటికీ పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తొలిరోజునే నూరుశాతం పింఛన్లను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకే ఈ పింఛన్ల పండుగ ప్రారంభమవుతుంది. జిల్లాలోని 2లక్షల 62 వేల 836 మంది లబ్ధిదారులకు రూ.112.68 కోట్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 5,298 మంది గ్రామ/వార్డు సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బంది ఈ మేరకు పింఛన్లను అందించనున్నారు. ఒక్కొక్కరు 50 మంది చొప్పున పంపిణీ చేయనున్నారు. పెన్షన్ మొత్తాలను ఇప్పటికే సిద్ధం చేశారు. గిరిజన ప్రాంతాల్లో పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు కారణంగా నవంబరు 30వ తేదీనే లబ్ధిదారులకు పింఛన్లను అందజేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా కారణం చేత తీసుకోని వారికి 2వ తేదీ సోమవారం పంపిణీ చేయాలన్నారు.

మండలాల వారీగా పింఛన్ పంపిణీ ఇలా..

మండలం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం
ఆగిరిపల్లి	9636	4,14,06,000
భీమడోలు	8865	3,83,48,500
బుట్టాయిగూడెం	6970	2,90,45,000
చాట్రాయి	8336	3,49,19,500
చింతలపూడి	9371	4,01,62,500
చింతలపూడి అర్బన్	2767	1,20,69,500
దెందులూరు	9430	4,11,53,000
ద్వారకాతిరుమల	9770	4,21,07,500
ఏలూరు	5278	2,27,47,000
ఏలూరు అర్బన్	28433	12,43,28,000
జంగారెడ్డిగూడెం	8853	3,83,01,000
జంగారెడ్డిగూడెం అర్బన్	4854	2,09,36,000
జీలుగుమిల్లి	4272	1,81,23,500
కైకలూరు	9389	4,03,26,000
కలిదిండి	9565	4,06,88,500
కామవరపుకోట	8039	34022000
కొయ్యలగూడెం	10210	4,39,61,000
కుక్కునూరు	5294	2,23,38,000
లింగపాలెం	7890	3,39,22,000
మండవల్లి	6842	2,88,48,000
ముదినేపల్లి	8888	3,78,28,000
ముసునూరు	7874	3,30,75,500
నిడమర్రు	6197	2,61,04,500
నూజివీడు	10431	4,41,52,500
నూజివీడు అర్బన్	5227	2,24,77,500
పెదపాడు	9288	3,97,09,000
పెదవేగి	11952	5,24,59,500
పోలవరం	6613	2,80,65,000
టి.నరసాపురం	7703	3,29,77,500
ఉంగుటూరు	11446	4,90,19,000
వేలేరుపాడు	3153	1,31,80,000
మొత్తం	**2,62,836**	**112,68,00,500**

బొమ్మ తొలగింది!



కాట్లంపూడిలో సర్వేరాళ్లపై జగన్ బొమ్మ,పేరును తొలగిస్తున్న కార్మికుడు



- ప్రజాధనం.. రాళ్ల పాలు చేసిన జగన్ సర్కార్
- ప్రజలు వద్దన్నా అప్పట్లో సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు.. పేర్లు
- ప్రస్తుతం తొలగించే పనిలో రెవెన్యూ, సర్వేశాఖ బిజీబిజీ
- అప్పట్లో రాయి పాతేందుకు రూ.150.. ఇప్పుడు తొలగించేందుకు రూ.60 వ్యయం
- నాటి వైసీపీ ప్రభుత్వ పాపం.. ప్రజల నెత్తిన భారం

ఏలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన పాపాల ఫలితం జనాలు ఇప్పటికే అనుభవిస్తూనే ఉన్నారు. ప్రజల భూముల్లో వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020 పేరుతో పాతిన సర్వే రాళ్లపై అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి తనపేరు, బొమ్మ ముద్రించుకున్నారు. ఈ నిర్ణయంపై అన్ని వర్గాలు వ్యతిరేకించినా జగన్ పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజల మీద కోట్లభారం పడింది. ఇప్పుడు ఆ పేర్లు, బొమ్మలు తొలగించడానికి మళ్ళీ కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. జగనన్న బొమ్మ పడినా, తీసేసినా జనం జేబులకు చిల్లుపడుతోంది.

వైసీపీ ప్రభుత్వం జగ నన్న భూరక్ష 2020 కార్యక్రమం ద్వారా భూముల రీ సర్వే మొదలు పెట్టింది. జిల్లాలోని రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే 154 గ్రామాల్లో సర్వే పూర్తయింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో మైనింగ్ శాఖ పంపిణీ చేసిన సర్వేరాళ్లు పాతారు. జిల్లాలో సుమారు లక్షా57,223 రాళ్లను సరఫరా చేశారు. ఇప్పటివరకు జిల్లాలో లక్షా42 వేలకు పైగా సర్వేరాళ్లను పాతారు. వాటిపై అప్పటి సీఎం జగన్ పేరు, బొమ్మలు ముద్రిం చారు. అప్పట్లో ఈ నిర్ణయంపై ప్రజలు అభ్యంతరం తెలిపినా ఏమాత్రం పట్టించుకోలేదు. ఒక్కోరాయి పాతడానికి రూ.150 ఖర్చు అయింది.

తొలగించేందుకు రూ.60

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లు తొలగించేందుకు చర్యలు చేపట్టింది. రాళ్ళపై జగనన్న బొమ్మలు, పేర్లు తొలగించేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. తొలుత సాండ్ పేపర్‌ను ఉపయోగించినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. పైగా ఒక్కో రాయికి రూ.60లు ఖర్చు అవుతుంది. దీంతో ఆ పద్ధతిని అధికారులు విరమించుకున్నారు. యంత్రసాయంతో అయితే రూ.15 మాత్రమే వ్యయం అవుతుంది కాబట్టి శుక్రవారం నుంచి యంత్రాల సాయంతో జగన్ బొమ్మలు, పేర్లు తొలగిస్తున్నారు. తహసీల్దార్లు, సర్వే అధికారులు సాధ్యమైనంత త్వరగా ఈ పని పూర్తి చేయాలని భావిస్తున్నారు. భూసర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం పొలాల సరిహద్దులు నిర్ధారించి పాతేందుకు తెచ్చిన సర్వేరాళ్లు చాలా నిరుపయోగంగానే పడి ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో సైతం ఈ రాళ్లను పూర్తిగా వాడలేదు. దీంతో కొన్ని రైతుల పొలాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద వృథాగా పడిఉన్నాయి. అంతేకాకుండా రీసర్వేను తప్పులతడకగా చేశారని ఆరోపిస్తూ పలువురు రైతులు రాళ్లను ఏర్పాటు చేసేందుకు ఒప్పుకోలేదు.

రోగుల నుంచి అధిక సొమ్ములు వసూలు చేస్తే కఠిన చర్యలు

- అంబులెన్సు ఓనర్లు, డ్రైవర్లను హెచ్చరించిన డీటీసీ

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని రోగుల బంధువుల నుంచి అధిక డబ్బులు కోసం వేధిస్తున్నట్టు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అంబులెన్సు డ్రైవర్లను హెచ్చరించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏలూరులోని అంబులెన్సు ఓనర్స్, డ్రైవర్స్, యూనియన్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అనారోగ్య సమస్యలతో ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిని అంబులెన్సులలో తరలించే సమయంలో బంధువుల నుంచి అధిక డబ్బులు డిమాండ్ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడిచే అంబులెన్సు డ్రైవర్ల లైసెన్సును రద్దు చేయడంతో పాటు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన రవాణా రుసుమును మాత్రమే డ్రైవర్లు తీసుకోవాలన్నారు. అంబులెన్సు వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారులు భీమారావు, ప్రసాదరావు, శేఖర్, మహ్మద్ జమీర్, అంబులెన్సుల యజమానుల, డ్రైవర్ల యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీమ్

ఫెంగల్.. కలవరం

- మబ్బుల వాతావరణంతో రైతుల బెంబేలు
- హడావిడిగా మాసూళ్లు.. ధాన్యం అమ్మకాలు

ఏలూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావం జిల్లాపై లేకపోయినా శుక్రవారం మధ్యాహ్నం నుంచి మబ్బుల వాతావరణం రైతులను కలవర పెడుతోంది. ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పినా తీవ్ర వాయుగుండం కొనసాగుతుండడంతో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో 80 వేల హెక్టార్లలో సార్వాలో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 45 శాతం కోతలు పూర్తయ్యాయి. కోసిన వరి పంటను రక్షించుకోవడానికి రైతులు బరకాలను సిద్ధం చేసుకున్నారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మరోవైపు రాత్రి సమయాల్లో చలి విపరీతంగా పెరి గింది. గురువారం రాత్రి ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెంటీగ్రేడ్ కాగా, శుక్రవారం రాత్రి ఉష్ణోగ్రత 23 డిగ్రీ సెంటీగ్రేడ్‌గా ఉంది.



ముదినేపల్లి మండలం పెయ్యేరులో గాలులకు నేలకొరిగిన వరి పైరు

వాహనాల కొరత

ముదినేపల్లి : భారీగా వీస్తున్న గాలులకు ముదినేపల్లి మండలంలో ఇప్పటికే వందలాది ఎకరాల్లో వరి పైరు నేలకొరిగింది. రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోతామంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు వాహనాల కొరత ఏర్పడింది. శుక్రవారం మండలంలో వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్టు డీసీఎంఎస్ మండల ఇంచార్జ్ విజయ్ తెలిపారు.

చెరువుల్లో ఆక్సిజన్ లోపం

కలిదిండి : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు రోజులు ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మత్స్య శాఖాభివృద్ధి అధికారి రవికుమార్ తెలిపారు. కలిదిండిలో శుక్రవారం రొయ్యల చెరువులను పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యల చనిపోయే ప్రమాదం ఉందని నిరంతరాయంగా ఏరియేటర్లు తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్సిజన్ ట్యాబెట్స్ నిల్వ ఉంచుకోవాలని, విద్యుత్ కోత విధిస్తే ప్రత్యామ్నాయంగా అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేత తక్కువగా వేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

కైకలూరు : తుపాన్ ప్రభావంతో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి రైతులంతా అప్రమత్తంగా ఉండి తమ పంటలను కాపాడుకోవాలని ఆర్డీవో డాక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్ అన్నారు. కైకలూరు మండలం తామరకొల్లులో శుక్రవారం ధాన్యం రాశులను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏవో ఆర్ దివ్య, వీఆర్వో రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాలమ్



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

ఉత్సాహంగా ఏపీఆర్‌జేసీ క్రీడలు

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల(ఏపీఆర్‌జేసీ) రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం రెండోరోజు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన వారు రాష్ట్ర జట్లకు ఎంపికవుతారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. క్రీడా పోటీలను ఏపీఆర్‌జేసీ స్పోర్ట్స్ అధికారి కె.జయరాజు, ఏలూరు జిల్లా సమన్వయాధికారిణి ఎస్.భారతి, సంస్థ ఏఎంవో ఎన్.సంజీవరావులు పర్యవేక్షించారు.

బాలికల జూనియర్స్ విజేతలు

100మీటర్ల పరుగు: పి.భావన, జోన్ 3, ప్రథమ, వై.రాజీ, జోన్ -4, ద్వితీయ స్థానం పొందారు. 200 మీటర్ల పరుగు: వి.భవ్య, జోన్ -4, వి.వెంకటలక్ష్మి, జోన్ -1, ప్రథమ, బి.ప్రీతిక, జోన్ -2 ద్వితీయ, 400 మీటర్ల పరుగు: కె.అశ్విని, జోన్-4 ప్రథమ, కె.తనూజ, జోన్ 3, ద్వితీయ, 800 మీటర్ల పరుగు: కె.అశ్విని, జోన్-4 ప్రథమ, సీహెచ్.అమూల్య, జోన్- 3 ద్వితీయ, 1500 మీటర్ల పరుగు: కె.అశ్విని, జోన్-4 ప్రథమ, ఎస్.పావని, జోన్- 1 ద్వితీయ, డిస్కస్ త్రో : పి.కృష్ణశ్రీ జోన్- 2 ప్రథమ, వి.స్వప్న ద్వితీయ, జావెలిన్ త్రో : కె.శ్రావ్య, జోన్- 3 ప్రథమ, ఆర్.శృజ జోన్- 1 ద్వితీయస్థానాల్లో నిలిచారు. లాంగ్ జంప్ : ఎన్.కావ్య, జోన్ -4 ప్రథమ, వై.రమ్యశ్రీ ద్వితీయ, హైజంప్ : వి.సులక్షణ, జోన్-3, ప్రథమ, జి.సాయివర్ష ద్వితీయ, షాట్ పుట్ : ఎం.స్నేహ జోన్-4 ప్రథమ, ఎస్.కోవెల జోన్- 4, ద్వితీయస్థానంలో నిలిచారు.

బాలికల సీనియర్స్

100మీటర్ల పరుగు: డి.చిద్విలాసిని, ప్రథమ, వి.పరిమళ, జోన్-1 ద్వితీయ, 200 మీటర్ల పరుగు: వి.పరిమళ జోన్-3 ప్రథమ, వి.భార్గవి, జోన్-1 ద్వితీయస్థానంలో నిలిచారు. 400మీటర్ల పరుగు: జి.సౌమ్య జోన్-1 ప్రథమ, వి.పరిమళ జోన్-4, ద్వితీయ, 800 మీటర్ల పరుగు: పి.నవీన జోన్-4 ప్రథమ, వై.సుధ జోన్-3 ద్వితీయ, 1500 మీటర్ల పరుగు: పి.నవీన జోన్-4, ప్రథమ, వై.సుధ జోన్- 3 ద్వితీయ, డిస్కస్ త్రో: నిర్మలజ్యోతి, జోన్-4 ప్రథమ, కె.లావణ్య జోన్ -4, ద్వితీయ, జావెలిన్ త్రో: ఏ.లక్ష్మి, జోన్-1 ప్రథమ, పి.కౌసల్య జోన్-3, ద్వితీయ, లాంగ్‌జంప్: డి.చిద్విలాసిని జోన్-4 ప్రథమ, ఎ.విజయలక్ష్మి జోన్-3 ద్వితీయ, హైజంప్: బి.విజయలక్ష్మి జోన్-2, కె.సౌజన్య జోన్-1 ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. షాట్‌పుట్: వి.నిఖిత, జోన్-2 ప్రథమ, ఎస్.వాసవి జోన్-1 ద్వితీయస్థానాలు సాధించారు.

బాలికల జూనియర్స్ - గేమ్స్

కబడ్డీ: లక్కిరెడ్డిపల్లి జట్టు, జోన్-4, ప్రథమ, భీమిలి జట్టు జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. వాలీబాల్: పి.వెంకటాపురం జోన్ 2 ప్రథమ, పోలసానిపల్లి జోన్-2 ద్వితీయ, త్రోబాల్: సింగరాయకొండ, జోన్-3 ప్రథమ, పోలసానిపల్లి జోన్-2 ద్వితీయ, చెస్: ఎస్.రూపశ్రీ జోన్-4 వీటీఎస్ఎస్.సాహితి, జోన్ - 2 ప్రథమ, ద్వితీయ, క్యారమ్స్: నాగులపాలెం జట్టు జోన్-3ప్రథమ, తునిజట్టు జోన్-2, ద్వితీయ స్థానం సాధించారు.

బాలికల సీనియర్స్

కబడ్డీ: లక్కిరెడ్డిపల్లి జట్టు జోన్-4 ప్రథమ, సంఘం జట్టు జోన్-3 ద్వితీయస్థానం సాధించారు. వాలీబాల్: సింగరాయకొండ జట్టు జోన్- 3 ప్రథమ, గరుగుబిల్లి జట్టు జోన్- 1 ద్వితీయ, త్రో బాల్: పోలసానిపల్లి జోన్-2 ప్రథమ, కురుగుంట జోన్ -4 ద్వితీయ, చెస్: జి.సుష్మ, జోన్-2 ప్రథమ, టి.కృపాకుమారి జోన్-4 ద్వితీయ, క్యారమ్స్: మేఘడిగడ్డ, జోన్-1 ప్రథమ, వీరవనేని గూడెం జోన్- 2 ద్వితీయస్థానాల్లో నిలిచాయి.

బాలుర జూనియర్స్ - గేమ్స్

చెస్: ఎ.చరణ్‌కుమార్ జోన్-4 ప్రథమ, ఎస్.వరుణ్, జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. క్యారమ్స్: విశాఖ జట్టు జోన్-3 ప్రథమ, పాలకొండ జట్టు జోన్-1 ద్వితీయ.

సీనియర్స్ విభాగం

చెస్: పి.అభిషేక్, జోన్ -1 ప్రథమ, వి.శ్రవంత్ జోన్ -4 ద్వితీయస్థానంలో నిలిచారు. క్యారమ్స్: కోట జట్టు జోన్ -3 ప్రథమ, నబ్బవరం జట్టు జోన్ -1 ద్వితీయ స్థానం సాధించారు.

జూనియర్ స్పోర్ట్స్

100మీటర్ల పరుగు: జినరేంద్రకుమార్, జోన్-3 ప్రథమ, కేవీ.చరణ్, జోన్-4 ద్వితీయస్థానంలో నిలిచారు. 200మీటర్ల పరుగు: జి.లోకేష్ జోన్ -2 ప్రథమ, జి.నవీన్ జోన్- 4 ద్వితీయ, 400మీటర్ల పరుగు: జి.లోకేష్, జోన్- 2 ప్రథమ, జి.నవీన్, జోన్-4 ద్వితీయ, 800మీటర్ల పరుగు: కె.శ్రీకాంత్ రెడ్డి, జోన్ 4 ప్రథమ, జి.లోకేష్, జోన్- 2 ద్వితీయ, 1500మీటర్ల పరుగు: సి.యశ్వంత్, జోన్- 4 ప్రథమ, టి.నవీన్‌కుమార్, జోన్- 3 ద్వితీయ, డిస్కస్‌త్రో: ఎం.అజిత్ జోన్ -4 ప్రథమ, పి.హర్ష, జోన్ -1 ద్వితీయ, జావెలిన్ త్రో: జి.నరేంద్రకుమార్ జోన్-3 ప్రథమ, సీహెచ్.క్రాంతికుమార్ జోన్- 2 ద్వితీయ, లాంగ్‌జంప్: జి.నరేంద్రకుమార్ జోన్-3 ప్రథమ, ఎం.మంజిత్‌కుమార్ జోన్-4 ద్వితీయ, హైజంప్: బి.సృజన్, జోన్- 3 ప్రథమ, కె.వేణు, జోన్ -4 ద్వితీయ షాట్‌పుట్: ఎం.అజిత్‌నాయక్, జోన్-4 ప్రథమ, కె.చరణ్‌తేజ జోన్ -2 ద్వితీయ స్థానాలు సాధించారు.

బాలుర సీనియర్స్

100మీటర్ల పరుగు: జి.జశ్వంత్, జోన్-4 ప్రథమ, వై.సుబ్రహ్మణ్యం, జోన్-3, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 200మీటర్ల పరుగు: పి.సాయికుమార్, జోన్- 4 ప్రథమ, బి.చందు, జోన్- 4 ద్వితీయ, 400మీటర్ల పరుగు: డి.సందీప్, జోన్- 4 ప్రథమ, పి.సతీష్, జోన్ -3 ద్వితీయ, 800మీటర్ల పరుగు: డి.సందీప్, జోన్- 4 ప్రథమ, కె.వంశీ, జోన్ -2 ద్వితీయ, 1500మీటర్ల పరుగు: ఇ.విద్యాసాగర్, జోన్-4 ప్రథమ, పి.లక్ష్మీనారాయణ, జోన్ 4 ద్వితీయ, డిస్కస్ త్రో: సీహెచ్.అభి, జోన్ -1 టి.భరత్ కుమార్ జోన్- 4 ప్రథమ, ద్వితీయ, జావెలిన్‌త్రో: జి.జశ్వంత్, జోన్- 3, ఎస్.సతీష్‌కుమార్, జోన్- 3 ప్రథమ, ద్వితీయ, లాంగ్‌జంప్: పి.హరీష్, జోన్-2, వై.దినేష్, జోన్-4 ప్రథమ, ద్వితీయ, హైజంప్: టి.చరణ్‌తేజ, జోన్-3, బి.జగదీష్, జోన్-4 ద్వితీయ, షాట్‌పుట్: సీహెచ్.అభి, జోన్-1 జె.రోహిత్, వి.గణేష్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు.





అసలే చలికాలం.. రాత్రి వణుకుతూ ముసుగుతన్ని పడుకుంటే.. ఆ మజానే వేరు. చలి చలిగా.. వెచ్చ వెచ్చగా భలేగుంటుంది. తెలతెల్లగా తెలవారుతుంటే పొగమంచు కమ్ముకుని ఉంటే పడకపై నుంచి లేవడానికి మనసు ఒప్పుకోదు. శరీరం గజగజలాడుతుంది. అందుకే దుప్పటి ముసుగులో నుంచి బయటకు రాలేం. కాని, ఇది అందరికీ సాగుతుందా? పొట్ట కూటి కోసం అంత చలిలోను బతుకుపోరు సాగించాల్సిందే. ఉదయం 8 గంటల తర్వాత పది గంటల వరకు ఆఫీసులు, పాఠశాలలు, పనులకు పరిగెత్తడం సర్వసాధారణం. భానుడి కంటే ముందే.. నల్లని చీకటిలో తెల్లటి పొగ మంచును పలకరించి పనులకు ఉపక్రమించే వారెందరో. పాలు, కూరగాయల వ్యాపారులు, పేపర్ బోయ్ వెలుగు రాకుండానే పనులు చక్కబెడతారు. అంతేనా పారిశుధ్య పనివారు వణికే చలిలో సైతం చిరు చెమట తుడుచు కుంటూ పనిచేస్తేనే మనమంతా ఆరోగ్యం ఉంటాం. ఉదయాన్నే నిద్రలేచి మార్నింగ్ వాక్‌కు బయలుదేరిన వారికి దుకాణాల్లో వెచ్చని టీ రెడీ. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఇళ్లకు చేర్చడానికి ఆటోడ్రైవర్లు, కారు డ్రైవర్లు తెల్లవారుజామునే బస్, రైల్వే స్టేషన్‌లో సిద్ధం. ఏలూరు నగరం, భీమవరం పట్టణాల్లో తెల్లవారుజామున ఆంధ్రజ్యోతి కెమెరాలకు చిక్కిన దృశ్యాలు.

(ఆంధ్రజ్యోతి/భీమవరం, ఏలూరు)

వేడి వేడి వార్తలు





తెల్లవారుజాము నాలుగు గంటలకు.. హాట్‌హాట్ న్యూస్‌తో ఆంధ్రజ్యోతి పత్రికను పంచేందుకు

తెల్లారేసరికి క్లీన్





వేకువజామున 4.15 గంటలకు.. ఏలూరు, భీమవరం వీధులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తాజా కూరలతో..





తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో.. వ్యాపారులతో కూరగాయల మార్కెట్లు కళకళ

పాలు రెడీ



ఇంటింటికి పాల ప్యాకెట్లు ఇచ్చేందుకు..

రైలొచ్చింది



ఆటో సర్ : భీమవరం రైల్వే స్టేషన్ వద్ద డ్రైవర్ల పిలుపు..

సైకిళ్లపై సిద్ధం



తెల్లారకుండానే వంట సామాగ్రిని అమ్మేందుకు చిరువ్యాపారులు

ఆడి.. పాడి..


అధికారుల వన విహారం



వన సమారాధనలో క్రీడా పోటీల్లో తలపడుతున్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

భీమవరంటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అధికారులంతా ఒక్కసారిగా పిల్లలయ్యారు. కలెక్టర్, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులంతా కొంతసేపు వారి హోదా పక్కన పెట్టి ఉత్సాహంగా ఆటలాడారు. పాటలు పాడి అల్లరి చేశారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి ఆశ్రమం ఎదురుగా మామిడి తోటలో శుక్రవారం వన సమారాధన ఏర్పాటు చేశారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నిరంతరం ఎనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి వన సమారాధన మంచి ఆటవిడుపు అన్నారు.

కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి నేతృత్వంలో రెండు జట్లుగా వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడి అధికారులు, సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ మహిళా అధికారులు కబడ్డీలో కలబడ్డారు. డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు చెప్పిన కార్తీక మాసం విశిష్టత, ఆకివీడు తహసీల్దార్ ఫోక్ సాంగ్, ఆకివీడు మునిసిపల్ కమిషనర్ పేరడీ సాంగ్, మున్సిపల్ పాఠశాల టీచర్ అమ్మపాట, కలెక్టరేట్ సిబ్బంది పాటలతో అందరూ కేరింతలు కొట్టారు. వివిధ ఆటల్లో గెలుపొందిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. విజేతలకు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, తదితర అధికారులు బహుమతులను అందజేశారు.



తాబేలు అనుకునేరు..!

చిత్రం చూసి తాబేలు అనుకున్నారా.. అకస్మాత్తుగా చూస్తే అంతే. పరిశీలించి చూస్తే బొప్పాయి అని తెలుస్తుంది. పాలకోడేరు మండలం పెన్నాడలోని వెలిగట్ల సుబ్బారావు పెరట్లో బొప్పాయి మొక్క వింతైన కాయతో ఆశ్చర్యం కలిగించింది. సుబ్బారావు ఆ కాయను కోసి నేలమీద ఉంచితే తాబేలును తలపించింది. ఆయన చుట్టుపక్కల వారిని పిలిచి బొప్పాయి తాబేలు చూపి సంబరపడ్డారు.

- పాలకోడేరు

వైవిధ్యం



బొంగు చికెన్

ఆహో.. ఏమి రుచి

మాంసాహార ప్రియులను మైమరపించే ఏజెన్సీ వంటకం



ప్రాధాన్యత లేని విషయం చెప్పినా.. చూసినా ఆ బొంగు అనడం పరిపాటి. బొంగు అంటే ఖాళీ.. డొల్ల అని భావమన్న మాట. వెదురు కర్రలను కూడా బొంగు అంటారు. ఆ బొంగులో వండిన చికెన్ కూర అంటే మాంసాహార ప్రియులు లొట్టలు వేస్తారు. బొంగు చికెన్ తయారీ, రుచి చూడండి.

- పోలవరం

పాపికొండల పర్యటనలో బొంగు చికెన్, బొంగు బిర్యానీ ప్రత్యేకం. పచ్చి వెదురు బొంగును ముక్కలుగా చేసి ఒకవైపు కణుపు మూసి ఉండే విధంగా నరికి మరోవైపు మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు కలగలిపి గంట నుంచి రెండు గంటలు ఉంచిన చికెన్ ఆవిరి బయటకు పోనీకుండా పైన ఆకులతో మూసి వేస్తారు. ఆ గొట్టాలను కణకణమండే నిప్పుల్లో కాల్చుతారు. కాలిన వెదురు గొట్టాలలో సహజ సిద్ధంగా ఉండే నీరు వేడికి ఆవిరై లోపల చికెన్ ఉడికి రుచికరంగా తయారవుతుంది. బిర్యానీ సరుకులు, బియ్యం, సుగంధద్రవ్యాలు కలిపి బిర్యానీ కూడా చేస్తారు. ఈ వంటకాలు వెదురు బొంగులో సహజ సిద్ధంగా ఉండే నీరు పోషకాలు, ఔషధగుణాలతో మరింత రుచికరంగా మారుతుంది. ఇలా తయారైన బొంగు చికెన్ బొంగు బిర్యానీలను పాపికొండల బోటు పర్యటనకు వచ్చే పర్యాటకులకు విక్రయించి గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. ఒక్కసారి పాపికొండల పర్యటనకు వచ్చి బొంగు చికెన్ బొంగు బిర్యానీ రుచి చూసినవారు మరిచి పోలేరు. పాపికొండల ప్రాంతంలో కొల్లూరు, పేరంటాలపల్లి గ్రామాల్లో బొంగు చికెన్, బొంగు బిర్యానీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. హైదరాబాద్, వైజాగ్, రాజమహేంద్రవరం వంటి నగరాల్లో రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాల నుంచి బొంగులు దిగుమతి చేసుకుని స్పెషల్ డిష్‌లుగా విక్రయిస్తున్నారు.

ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం





ఉమ్మడి కుటుంబాలు దాదాపు కనుమరుగయ్యాయి. మూడు.. నాలుగు తరాల బంధుత్వాలతో కళకళలాడే ఇళ్లు నేడు వెలవెలబోతున్నాయి. ఒకప్పుడు కుటుంబాలలో సహపంక్తి భోజనాలతో పదుల సంఖ్యలో కుటుంబీకులు కలిసి భోజనం చేసే పరిస్థితి నుంచి స్విగ్గీ, జుమాటో వంటి హోం డెలివరీ ఫాస్ట్‌ఫుడ్ నగరాల నుంచి గ్రామాలకు వచ్చేశాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 10 లక్షల కుటుంబాలు ఉండగా కేవలం పదుల సంఖ్యలోనే ఉమ్మడి కుటుంబాలు కనిపిస్తున్నాయి. నగరాలు, పట్టణాలలో వ్యష్టి కుటుంబాలు ఉన్నప్పటికీ గ్రామాలలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు గ్రామాలతో సైతం కనుమరుగయ్యాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడంపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

-(పాలకొల్లు/ఆంధ్రజ్యోతి)

- మమతానురాగాలకు దూరం
- అమ్మమ్మ, తాతయ్య పలకరింపులు లేవు
- మరుగున పడుతున్న బంధాలు
- సూక్ష్మ కుటుంబాలతో యాంత్రిక జీవనం

మూడు నాలుగు దశబ్దాలు వెనుకకు వెళితే ఏ కుటుంబంలో చూసినా పదుల సంఖ్యలో సభ్యులు ఉండేవారు. ఇప్పుడు అధిక శాతం కుటుంబాలలో మూడు లేదా నలుగురు మాత్రమే ఉంటున్నారు. నగరీకరణ, పట్టణీకరణ నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గుతూ వస్తున్నప్పటికీ గ్రామాలు, పల్లెల్లో సూక్ష్మ కుటుంబాలు వెలియడం ఆందోళన కలిగించే అంశమని సామాజిక వేత్తలు చెబుతున్నారు. కుటుంబానికి సంబంధించి కొంతమంది వ్యక్తుల సమూహంగా సామాజిక వేత్తలు పేర్కొంటారు. నేడు చిన్న కుటుంబాలు పుట్టుకు రావడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. సమూహంగా పిలువబడే కుటుంబాలలో ఆధిపత్య ధోరణి ఒకవైపు, అవసరాలు మరో వైపు ఉమ్మడి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. పలు అధ్యయనాల ప్రకారం కుటుంబాలు క్షీణదశకు చేరడానికి ఆర్థిక సంబంధాలు కారణమని తెలుస్తుంది.

చిన్న కుటుంబాలతో లాభమా..

చిన్న కుటుంబం అంటే భార్యభర్త ఒకరు లేదా ఇద్దరు పిల్లలు. అప్పటివరకూ పెంచిపోషించిన తల్లిదండ్రులను దూరం పెట్టి ఉద్యోగరీత్యా లేదా ఇతర కారణాలు, ఇంట్లో అత్తాకోడళ్ల మధ్య వివాదాలు తదితర కారణాలు చిన్న కుటుంబాల వైపు ప్రేరేపిస్తున్నాయి. దీంతో ఉమ్మడి కుటుంబం నాలుగు ముక్కలవుతున్నది. చిన్న కుటుంబాలలో మేలు ఉన్నప్పటికీ కష్టాలే ఎక్కువ. చిన్న పిల్లలకు సంస్కారం నేర్పే నానమ్మ తాతయ్యలు అమ్మమ్మలు దూరం అవుతున్నారు. దీంతో ఎదుగుతున్న పిల్లల్లో మానవ సంబంధాలపై అవగాహన తగ్గుతున్నది.

ఉమ్మడి కుటుంబాలతో లాభం..

అమ్మమ్మ, నానమ్మ తాతయ్య, మేనమామ మేనత్త అక్కా బావ, వదిన మరదలు వంటి బంధుత్వాలతో విలసిల్లే ఉమ్మడి కుటుంబంలో అనేక లాభాలున్నాయి. కుటుంబ ఖర్చు తగ్గుతుంది. సూక్ష్మ కుటుంబాలలో కుటుంబ నిర్వహణ తడిపి మోపెడు. ఉమ్మడి కుటుంబాల వలనే ఆయా సమూహాలకు మేలు జరుగుతుందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

తగ్గుతున్న మమతానుబంధాలు

ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో కుటుంబ సభ్యుల మధ్య మమతానుబంధాలు లోపిస్తున్నాయి. పలు సందర్భాలలో మానవ సంబంధాల స్థానంలో ఆయా కుటుంబ సభ్యులు మధ్య ఆర్థిక సంబంధాలే కనిపిస్తున్నాయి. బాల్యంలో చిన్నారులకు విద్యతో పాటు సామాజిక పరిస్థితులపై అవగాహన, మానవ సంబంధాల విలువలు తెలియచెప్పే పెద్దలు ఇంట లేకపోవడంతో మమతాను రాగాలకు దూరమవుతున్నారు.

మానవ సంబంధాలు ఎక్కడ..?

కారణం ఏదైనప్పటికీ ఉమ్మడి కుటుంబం నుంచి చిన్న కుటుంబాలు వెలేయటంతో మానవ సంబందాలు పలుచబడుతున్నాయి. ఇప్పుడు పల్లెలు, గ్రామాలలో అధిక శాతం పౌరులు 50 ఏళ్ల వయసు పైబడిన వారే. వ్యవసాయం లేదా వృత్తులలో ఉన్న గ్రామంలో ఉన్నప్పటికీ వ్యాపారాలు ఉద్యోగాలు వేటలో యువత నగరాలకు వెళ్లిపోతున్నారు. పండుగలకు, ఇతర సందర్భాలలో మాత్రమే సొంత ఇంటికి వచ్చే పరిస్థితి ఉంది. యాంత్రిక జీవనంతో ఆయా కుటుంబంలోని తల్లిదండ్రులు అనారోగ్యం బారిన పడుతుం డగా బాల్యం మానసిక వికాశానికి దూరమవుతున్నది.

మండువాలు లేవు

ఒకప్పుడు గ్రామాలకు వెళితే మండువా లోగిళ్లలో ఉమ్మడి కుటుంబాలు కనిపించేవి. లోగిలి హాలుకు చుట్టూ గదులలో పలు కుటుంబాలు ఉండేవి. ఆ సంస్కృతి సింగిల్ బెడ్‌రూం డబుల్ బెడ్‌రూం స్థాయికి మారింది. మొత్తంగా ఆర్థిక అసమానతలు పెరిగాయి. కేవలం ఏవో కొన్ని సందర్భాలలోనే ఆయా ఉమ్మడి కుటుంబాలలోని అన్ని సమూహాలు కనబడే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి అవసరాల నుంచి వ్యక్తిగత అవసరాల ఆలోచనాధోరణితో సూక్ష్మ కుటంబాల సంఖ్య పెరుగుతోంది.

ఆంటీ.. అంకుల్..

వరుసలతో పిలిచే ఆత్మీయ పలకరింపులు కనుమరుగయ్యాయి. పాశ్చాత్య సంస్కృతి అనుసరిస్తున్న ప్రస్తుత సమాజంలో వయోబేధం లేకుండా అందరినీ ఒకే గాటన ఆంటీ అంకుల్ అని పిలుస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న పరిస్థితుల్లో చిన్న కుటుంబాలలోని బాలలలో మానసిక పరిపక్వత ఏ స్థాయిలో తగ్గుతుందనే దానికి ఒక ఉదాహరణ... ఐదో తరగతి విద్యార్థినిని కుటుంబం గురించి రాయమంటే నాకు అమ్మా నాన్న ఉన్నా రు. ఒక చెల్లి ఉంది. నాన్న బ్యాంకు ఉద్యోగా నికి వెళ్లతారు. అమ్మ పాఠశాలలో పాఠాలు చెప్పడానికి వెళ్తుంది. నన్ను స్కూల్‌కు పంపి చెల్లిని చూడడానికి కేర్ టేకర్‌ను పెట్టారు. ఎక్కువగా హోటల్ నుంచే ఆహారం తెచ్చుకుని తింటాం. నేను అమ్మానాన్నతో గడిపే సమయం తక్కువ. వాళ్లకు నాతో మాట్లాడటానికే తీరిక ఉండదు. పదేళ్ల బాలిక ఇలా రాయడం నేటి కుటుంబ వ్యవస్థ తీరుకు అద్దం పడుతుంది.

పెన్షన్ టెన్షన్

- వెలుగు రాకముందే పింఛన్ల పంపిణీకి శ్రీకారం
- సొమ్ముతో గ్రామాల్లోకి వెళ్లేందుకు సచివాలయ ఉద్యోగుల భయాందోళన
- కొన్ని గ్రామాల్లో ప్రధాన కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మధ్య కుదరని సఖ్యత
- గ్రామాల అభివృద్ధికి ఇది ఆటంకంగా మారుతోందని పలువురి అభిప్రాయం



పెంటపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ల పంపిణీలో కొన్ని సమస్యల కారణంగా ఉద్యోగులకు టెన్షన్‌గా మారింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెలకు సంబంధించి వృద్ధాప్య, వితంతు, తదితర కేటగిరీలకు సంబంధించి మొత్తం 2,28,362 మంది ఉన్నారు. వీరికి తెల్లవారు జామునుంచే సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తున్నారు. అయితే కొన్ని సమస్యలు సచివాలయ సిబ్బందిని ఇబ్బందికి గురిచేస్తున్నాయి. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 4,227 మంది సిబ్బంది

జిల్లాలో మొత్తం 4,227 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పెన్షన్ లబ్ధిదారులకు వీరే అందజేస్తున్నారు. ప్రతిరోజు వారు నివాసం ఉండే ఇతర ఊర్ల నుంచి విధులు నిర్వహించేందుకు గ్రామాలకు వెళ్తుంటారు. పెన్షన్ల పంపిణీకి ఒక రోజు ముందు బ్యాంకులకు వెళ్లి పెన్షన్ సొమ్మును సేకరిస్తారు. అనంతరం తమ పరిధిలోని గ్రామాలకు పింఛన్ల సొమ్మును తీసుకుని ఇళ్లకు వెళ్తారు. ఈ క్రమంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక పెన్షన్ సొమ్ము తీసుకుని బిక్కుబిక్కుమంటూ గ్రామాలకు వెళ్తున్నారు. మహిళా ఉద్యోగులలో ఈ భయం చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో సమస్య మరింత జటిలంగా మారింది. శీతాకాలంలో ఉదయం ఆరు గంటలు దాటితే గాని వెలుగురాదు. పెన్షన్ల సొమ్ము పట్టుకుని ఉదయం ఐదు గంటలకే గ్రామాల్లోకి వెళ్తున్నారు. ఎప్పుడు ఏమవుతుందోనని సచివాలయ సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందికి కుదరని సఖ్యత

కొన్ని సచివాలయాలలో పంచాయతీ ప్రధాన కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సఖ్యత కుదరడం లేదు. జిల్లాలో మొత్తం సుమారు 150 మంది కార్యదర్శులు ఉన్నారు. వీరిలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4 కేటగిరీలకు సంబంధించిన కార్యదర్శులు ఉన్నారు. గతంలో పంచాయతీలలో ప్రథమ ప్రాధాన్యత కార్యదర్శులకు మాత్రమే ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన తరువాత వీరిద్దరి మధ్యలో విభేదాలు తలెత్తాయి. వాస్తవానికి కార్యదర్శుల కంటే కొంతమంది సచివాలయ సిబ్బంది ఎక్కువ చదువుకున్న వారూ ఉన్నారు. వీరిలో కొంతమంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఉన్నారు. ఏ ఉద్యోగం రాక కొంతమంది సచివాలయ పోస్టుల్లో జాయిన్ అయితే, మరికొంత మంది విధులు నిర్వహిస్తూ వారికి మంచి ఉద్యోగం వచ్చిన వెంటనే సచివాలయ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిన వారు ఉన్నారు. గ్రామాల అభివృద్ధి చెందాలంటే కార్యదర్శి, సచివాలయ సిబ్బంది మధ్య సఖ్యత ఉండడం చాలా అవసరం. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

క్షీరా రామలింగేశ్వరుడికి హైకోర్టు జడ్జి పూజలు



హైకోర్టు జడ్జి సుజాతకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని శుక్రవారం హైకోర్టు జడ్జి వి.సుజాత దర్శించుకుని పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాలను, చిత్రపటాన్ని ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గాకిషోర్, స్థానిక కోర్టు న్యాయమూర్తి, సిబ్బంది, డీఎస్పీ డాక్టర్ జి.వేద, సీఐ రజనీకుమార్ తదితరులు ఉన్నారు.



అయిభీమవరం వేద పాఠశాలకు ఎలక్ట్రికల్ ఆటోను బహూకరిస్తున్న దృశ్యం

వేద పాఠశాలకు ఎలక్ట్రికల్ ఆటో బహూకరణ

ఆకివీడురూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అయిభీమవరం గ్రామంలోని టీటీడీ వేద పాఠశాలకు ఏలూరు గుప్తా ఫౌండేషన్‌కు చెందిన మదుపల్లి మోహన్‌గుప్తా రూ.4 లక్షలు విలువ చేసే ఎలక్ట్రికల్ ఆటోను టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. వేద పాఠశాలకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని బాపిరాజు దంపతులు అన్నారు. గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు వేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ప్రిన్సిపాల్ వారణాసి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు దుర్గాప్రసాద్ ఘనాపాఠి, కనుమూరు రామకృష్ణరాజు, జేఎస్ఆర్, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిగా షరీఫ్ బాధ్యతలు



షరీఫ్‌కు బొకే అందిస్తున్న పొత్తూరి, టీడీపీ నాయకులు

నరసాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సెల్, ప్రభుత్వ సలహాదారుడిగా శుక్రవారం అమరావతిలో ఏఎం షరీఫ్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి తీరం నుంచి కూటమి నాయకులు భారీగా తరలివెళ్లారు. పట్టణం, మండలం, పాలకొల్లు, ఆకివీడు తదితర ప్రాంతాల నుంచి ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో అమరావతికి వెళ్లారు. ఆయనకు పుష్ప గుచ్ఛాలు, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బా రాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, వీసీ కొత్తపల్లి నాని, జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్, కొల్లు పెద్దిరాజు, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, షేక్ హుస్సేన్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్స్ స్కాలర్‌షిప్‌కు బంగారుగూడెం విద్యార్థి అనీశ్



అనీశ్

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్టాత్మకమైన పురాతన రోడ్స్ స్కాలర్‌షిప్‌కు ప్రవాసాంధ్ర విద్యార్థి బంగారుగూడెంకు చెందిన ముప్పిడి అనీశ్ ఎంపికయ్యారు. యూకేలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ (పీజీ) పూర్తిచేసేందుకు మూడువేల మంది హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యేల్, ఎంఐఎల్ వంటి ప్రపంచ అగ్రశ్రేణి వర్సిటీల్లోని విద్యార్థులు ఈ స్కాలర్‌కు పోటీపడ్డారు. వారిలో 32 మందిని మాత్రమే ఈ స్కాలర్‌కు ఎంపిక చేయగా వారిలో మన రాష్ట్రానికి చెందిన తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెంకు చెందిన అనీశ్ ఒకరు. వచ్చే ఏడాది అక్టోబరులో ఆక్స్‌ఫర్డ్‌లో చేరనున్నారు. ఈ ఘనత సాధించిన అనిశ్‌ను తల్లిదండ్రులు ముప్పిడి రామిరెడ్డి, కుమారి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే చర్యలు తప్పవు



తాడేపల్లిగూడెం ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే చర్యలు తప్పవని ఏడీఏ రమేష్ హెచ్చరించారు. జంబ్లింగ్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మండలంలోని పెదతాడేపల్లి, పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదతాడేపల్లి శ్రీనివాస ఫెర్టిలైజర్స్‌లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లేని రూ.86 వేల విలువ గల పురుగుల మందుల విక్రయాలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్, ఏఈవో సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



అక్కడికి మేం రాం..?

నరసాపురం పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ అంటే చాలు.. ఉద్యోగులు హడలెత్తిపో తున్నారు. ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. కనీసం సస్పెండ్ అయిన ఉద్యోగులు కూడా మేం అక్కడికి వెళ్లమంటూ దాటేస్తున్నారు. ఫలితంగా ఏడేళ్ల నుంచి ఈ సెక్షన్‌లో చాలా పోస్టులు ఖాళీగా ఉంటున్న పరిస్థితి దాపురించింది.

- సెక్షన్‌లో ఉండాల్సింది ఆరుగురు
- ఏడేళ్లుగా ఇద్దరు ముగ్గురితోనే విధులు
- అన్నీ నిబంధనలకు విరుద్ధంగా పనులు
- ప్రస్తుతం సూపర్‌వైజర్ ఒక్కరే, సెలవుపై వెళ్లేందుకు ప్రయత్నాలు

నరసాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నరసాపురం టౌనింగ్ సెక్షన్ ఇంకా దిగజారిపోయింది. కొంత మంది నేతల అండదండలతో నిర్మాణదారులు నిబంధనలన్నీ తుంగలోకి తొక్కి అడ్డగోలుగా భవనాలు కట్టారు. ఇరుకు సందుల్లో పెద్దపెద్ద భవనాలు వెలిశాయి. ఇక అపార్టుమెంట్లు కూడా నిబంధనలు పాటించలేదన్న వాదనలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన నిర్మాణాలను చూసి ప్రస్తుతం ఎవరూ మునిసిపాల్టీకి వచ్చేందుకు సాహసించడం లేదు. ఫలితంగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఈ సెక్షన్‌లో పని చేస్తున్నారు. ఆయన కూడా సూపర్‌వైజర్ కేడర్ అధికారి. ఇక్కడ పరిస్థితుల్ని గమనించిన ఆయన కూడా సెలవుపై వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఈ సెక్షన్ అంతా ఖాళీ అవ్వడం ఖాయమన్న వాదనలు లేకపోలేదు.

12 కిలోమీటర్ల మేర పట్టణ విస్తరణ

పన్నెండు కిలోమీటర్ల మేర పట్టణ పరిధి విస్తరించింది. 31వార్డుల పరిధిలో సుమారు 18 వేల వరకు నివాసాలు ఉన్నాయి. ఏటా భవన నిర్మాణాలకు 140 దరఖాస్తులు వస్తాయి. వీటిలో 125 మంది వరకు ఇళ్లు కడతారు. మునిసిపల్ స్థాయికి అనుగుణంగా ఇక్కడ ఇక టీపీవో, ఒక సూపర్‌వైజర్, నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. గత ఐదేళ్ళల్లో ఇక్కడ ఈ పోస్టులు ఒక్కసారి కూడా భర్తీ కాలేదు. కీలకమైన టీపీవో వచ్చినా.. ఒకటి రెండేళ్లు మించి ఉండడం లేదు. ఏడాదిక్రితం ఇక్కడికి వచ్చిన టీపీఎస్ రామచంద్రపురానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో కూడా సూపర్‌వైజర్ ఇన్‌చార్జిలే కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఉన్న సూపర్‌వైజర్‌ను కూడా ఒక ప్రజాప్రతినిధి ఒప్పించి తీసుకొచ్చారన్న వాదనలు లేకపోలేదు.

అన్నీ ఫిర్యాదులే..

పట్టణ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ కొన్ని నిబంధనలను నిర్దేశిస్తుంది. దానికి అనుగుణంగా నివాసాలు చేపట్టాలి. ముందుగా ప్లాన్ అనుమతి తీసుకోవాలి. అయితే ఈ పురపాలకంలో తీసుకున్న ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టరనే వాదనలు ఉన్నాయి. వీటితోపాటు పెట్టిన ప్లాన్, కట్టే నిర్మాణానికి పొంతన ఉండదన్న ఆరోపణలు లేకపోలేదు. సాధారణంగా ఇరుకు రహదార్లలో మూడు నాలుగు అంతస్తులకు అనుమతి ఉండదు. కానీ ఇక్కడ ఇవే ఎక్కువగా కనిపిస్తాయి. ఇక పెద్ద పెద్ద భవనాలు నిర్మించేటప్పుడు కొన్ని నిబంధనలు ఉంటాయి. కచ్చితంగా సెట్ బ్యాక్ ఉండాలి. కానీ ఇక్కడ చాలా ఇళ్లకు ఇది కనిపించదన్న వాదనలు కూడా ఉన్నాయి. ఈ నిబంధనలన్నీ ఇక్కడ పని చేసే అధికారులు ప్రశ్నించకూడదు. ఒకవేళ నిలదీస్తే ఆ ఉద్యోగిపై అన్నిశాఖలకు ఫిర్యాదులు పెడతారు. ఈ కారణంగా గతంలో ఇక్కడ పని చేసిన చాలామంది అధికారులు చార్జీ మెమోలు అందుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగానే పోస్టింగ్‌లో ఇచ్చే డైరెక్టర్ కార్యాలయంలోనే నరసాపురం మునిసిపాల్టీ అంటేనే రాష్ట్రవ్యాప్తంగా ఓ ముద్రపడి పోయిందన్న వాదనలు ఆ ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. అందుకే ఇక్కడ పని చేసేందుకు ఎవరూ రావడం లేదని చెబుతుంటారు.

ఆంగ్లమాధ్యమంలోనే 'ఎన్ఎంఎంఎస్' నిర్వహించాలి

- హాల్ టికెట్లు మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన



హెచ్ఎంతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లితండ్రులు

మొగల్తూరు, నవంబరు 29 : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించి తమ పిల్లలకు ఆంగ్లమాధ్యమంలో నిర్వహించేలా హాల్ టికెట్‌లు ఇవ్వాలని ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల వద్ద శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివే 54 మంది విద్యార్థులకు ఈ పరీక్షలకు దరఖాస్తు చేశారు. విద్యార్థులు అంగ్లమాధ్యమంలో దరఖాస్తు చేసుకోగా ఆన్‌లైన్ చేసిన పాఠశాల సిబ్బంది తెలుగు మీడియంకు దరఖాస్తు చేశారు. డిసెంబరు 8న జరిగే ఈ పరీక్షకు సంబంధించి శుక్రవారం హల్ టికెట్‌లు వచ్చాయి. తెలుగు మీడియంలో పరీక్ష నిర్వహించే విధంగా హల్‌టికెట్‌లు రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలలో ఆందోళనకు దిగారు. 54 మంది విద్యార్థుల్లో ఒకరికి మాత్రమే ఆంగ్లమాధ్యమంగానూ మిగిలిన వారికి తెలుగు మీడియంలోనూ హల్‌టికెట్‌లు వచ్చాయి. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు ఆంగ్ల మాధ్యమంలోనే చదువుతు న్నారని తెలుగుమాధ్యమంలో పరీక్ష రాస్తే నష్టపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై హెచ్ఎం రామరాజు మాట్లాడుతూ దరఖాస్తు సమర్పించడంలో తమ సిబ్బంది లోపం కారణంగా తెలుగుమీడియం హాల్ టికెట్‌లు వచ్చాయన్నారు. సమస్యను డీఈవో, రాష్ట్రస్థాయి పరీక్షల నిర్వాహకులతో మాట్లాడి విద్యార్థులందరూ అంగ్లమాధ్యమంలో పరీక్ష రాసే విధంగా హల్ టికెట్‌లు ఇప్పించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆందోళనలో దొంగ ప్రసాద్, కవురు ముత్యాలరావు, కడలి యోగానంద, కాండ్రేకుల సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ కొల్లాటి చూడామణి తదితరులున్నారు.



లేసు వస్తువుల్ని పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు

లేసు అల్లికలకు మరింత ప్రోత్సాహం

మొగల్తూరు/నరసాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లేసు అల్లికలను ప్రోత్సహించేందుకు మహిళల నైపుణ్యాభివృద్ధికి కేంద్ర హస్తకళల ద్వారా మరింత ప్రోత్సాహకాలను అందిస్తున్నట్టు సౌత్ ఇండియా హ్యాండీక్రాఫ్ట్ రీజనల్ డైరెక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం మొగల్తూరు మండలం కేపీ పాలెంలో నిర్వహిస్తున్న గురు శిష్య హస్త శిల్పి ప్రశిక్షన్ కార్యక్రమాన్ని, నరసాపురం మండలం సీతారాంపురంలోని లేసు పార్కును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల తయారీలో నైపుణ్యం ఉంటే మార్కెటింగ్ ఉంటుందని, తద్వారా ఆర్డర్లు వస్తాయన్నారు. బోకే, గిఫ్ట్ ఆర్టికల్స్ వస్తువులకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. లేసు అల్లికల ద్వారా మహిళల అభివృద్ధికి భౌగోళిక గుర్తింపునకు కృషి చేస్తున్నామన్నారు. విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, మేనేజర్ కుసుమకుమారి, సీనియర్ కన్సల్టెంట్ ఐ.శ్రీనివాసరావు, పీకె రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్ సర్టిఫికెట్ అడిగినందుకు విద్యార్థిపై దూషణ

ఓ ప్రైవేటు కళాశాల నిర్వాకంపై ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు

ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లు అడిగినందుకు ఓ విద్యార్థినిని అసభ్య పదజాలంతో స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం నిందించిన వ్యవహారంపై ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు అందింది. ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన ఓ విద్యార్థి ప్రస్తుతం మరో కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇంటర్ ఉత్తీర్ణత/ఒరిజినల్ మార్కుల జాబితాలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాలలకు పంపడంతో తన సర్టిఫికెట్ కోసం గురువారం తాను చదివిన కళాశాలకు వచ్చి యాజమాన్యాన్ని అడిగాడు. ఇంటర్‌లో పూర్తి ఫీజులు చెల్లించినప్పటికీ పాస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా రోజులతరబడి ఎందుకు తిప్పించుకుంటున్నారని నిలదీశాడు. తనకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అసభ్యపదజాలంతో కళాశాల యాజమాన్యం తనపట్ల ప్రవర్తించిన తీరును ఆడియో రికార్డ్ చేసి దానిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఇంటర్ బోర్డు జిల్లా అధికారుల దృష్టికి చేరింది. ఈ క్రమంలో సంబంధిత బాధిత విద్యార్థిని శుక్రవారం తన కార్యాలయానికి పిలిపించి ఫిర్యాదు తీసుకున్నామని, ఇదే కళాశాలలో ఇటీవల ఓ విద్యార్థి సర్టిఫికెట్ల కోసం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆర్ఐవో వివరించారు. అనుమతులు లేకుండా ఓపెన్‌స్కూలు కాంటాక్టు తరగతులు, యూనివర్సిటీ దూరవిద్య పరీక్షల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్టు కళాశాల యాజమాన్యంపై గతంలో ఆరోపణలు వచ్చాయన్నారు. తాజాగా ఇంటర్ ఉత్తీర్ణుడైన విద్యార్థికి పాస్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి కళాశాల యాజమాన్యం పెట్టిన ఇబ్బందులు, కళాశాలపై వున్న ఆరోపణలను ఇంటర్‌బోర్డు కార్యదర్శికి నివేదిక రూపంలో పంపిస్తున్నట్టు ఆర్ఐవో వెల్లడించారు.

క్రైమ్ కార్నర్

వృద్ధుడి మృతదేహం లభ్యం

ఉంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు వద్ద కాల్వలో గురువారం స్నానానికి దిగిన వృద్ధుడు యర్రారపు గంగరాజు (65)అనే గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం గల్లంతయిన ప్రాంతంలోనే మృత దేహం లభ్యమైంది. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధుడు మరణించాడని రైల్వే ఎస్ఐ పి. సైమన్‌కు సమాచారం అందింది. శుక్రవారం మధ్యాహ్నం సిబ్బందితో పవర్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. మృతుడు ఏలూరు గాంధీనగర్ కంకణాలవారి వీధికి చెందిన దారెడ్డి సత్యనారాయణరెడ్డి(64)గా గుర్తించారు. అనారోగ్య కారణంతో అతడు మరణించి నట్టు చెబుతున్నారు. అయినప్పటికీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీసుకున్న అప్పు అడిగాడని యాసిడ్ పోసిన యువతి

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడుగుతున్న యువకుడిపై యువతి యాసిడ్ దాడి చేసిన ఘటన ఈనెల ఆరో తేదీన పాలకోడేరులో జరిగింది. యువకుడిచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని పాలకోడేరు పోలీసులు తెలిపారు. విజయవాడకు చెందిన డోలా రేష్మతో పాలకోడేరుకు చెందిన మునుగుర్తి జయకృష్ణకు పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే రేష్మ దఫా దఫాలుగా రూ.2.40 లక్షలు అప్పుగా తీసుకుంది. ఆ అప్పును ఇవ్వమని అడిగినందుకు రేష్మ తనపై పాలకోడేరు ఉన్నత పాఠశాల వద్ద యాసిడ్ దాడి చేసిందని ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకోడేరు ఎస్ఐ మంచిన రవివర్మ తెలిపారు

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పెదపాడు ఎస్ఐ కేవీఎస్ సతీష్ శుక్రవారం తెలిపారు. ఆ వాహనంలోని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టించి, వాహన యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్కల మాస్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

విద్యార్థులను వేధిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ

ద్వారకాతిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఎంపీయూపీ స్కూల్ లెక్కల మాస్టర్ వ్యవహారం పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది. తమ పిల్లలను తరచూ కొడుతూ.. దూషిస్తున్న అతడిపై విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన వ్యవహార శైలిపై 'ఆ టీచరుంటే స్కూల్‌కు వెళ్లం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 26న ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు ఎంఈవో విచారణ చేసి అది నిజమే అని తేల్చారు. పిల్లలు, వారి తల్లిదండ్రుల పట్ల అతడి ప్రవర్తనసరిగా ఉండడం లేదని, ఇది ఆయన దుష్ప్రవర్తనగా గుర్తించి డీఈవోకు నివేదిక అందించారు. ఈ కారణంగా ఆయనపై క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో వివరణ కోరుతూ డీఈవో షోకాజ్‌నోటీస్ జారీ చేశారు. దీనిపై వచ్చేనెల నాలుగో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ కార్యాలయానికి వివరణ చేరాలని ఆదేశించారు. లేనిఎడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు శాంతించకుండా తమ పిల్లల పట్ల ఆయన అనుచిత ప్రవర్తనపై పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ సుధీర్ విచారణ చేస్తున్నారు.

భీమవరంలో మంత్రాలు, మాయల కలకలం !

భీమవరం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో గత కొద్దికాలంగా మంత్రాలు, మాయలు కలకలం రేపుతున్నాయి. మంత్రాలతో ఎవరి నివాసాల్లో ఎంత సొమ్ము ఉన్నా కూడా బయటకు రప్పించి దోచుకోవచ్చు అన్న అపోహతో ఇటీవల కొందరు రెచ్చిపోతున్నట్టుగా సమాచారం. పట్టణంలోని వంశీకృష్ణ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి నివాసంలో దొంగల ముఠా దొంగతనానికి ప్రయత్నించి పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి భీమవరం పట్టణంలోని వంశీకృష్ణ నగర్‌కు ఒక మంత్రగాడ్ని తీసుకువెళ్ళి ఇంటి నలుమూలలా ఇసుకను సేకరించి మంత్రాలు చేసినట్టు సమాచారం. ఈ మంత్రాల వల్ల ఆ వ్యక్తి నివాసంలోని సొమ్ము బయటకు వస్తుందన్న అపోహతో దుశ్చర్యలకు పాల్పడినట్టు తెలిసింది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎవరికి తెలియని ప్రదేశంలో విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరేందుకు సంప్రదించగా వారు స్పందించలేదు.

గన్ కలిగిన వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్ పిస్టల్‌ను కారులో పెట్టుకుని అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు నగరంలో ఈనెల 27వ తేదీ రాత్రి ఎస్ఐ కల్యాణి గస్తీ నిర్వహిస్తుండగా కొత్తపేట ప్రాంతంలో ఒక కారు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆ కారును తనిఖీ చేయగా కారులో ఎయిర్ పిస్టల్ ఉంది. ఈ మేరకు ఆ కారు యజమాని రంభా జనార్దన్‌పై కేసు నమోదు చేశారు. అతడు కర్నాటకలో ఎయిర్‌పిస్టల్‌ను కొనుగోలు చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. పూర్తిస్థాయిలో అన్నికోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్యారడైజ్ రెస్టారెంట్‌పై విజిలెన్సు అధికారుల తనిఖీ



తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ప్యారడైజ్ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలుపుతూ నిల్వ పదార్థాలను విక్రయిస్తున్నారని జిల్లా విజిలెన్సు ఎస్పీ పి.శ్రీరామ్‌బాబుకు విశ్వసనీయ సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు సీఐ రంజిత్‌కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి ప్రశాంత్‌కుమార్, ఆహార పదార్థాల తనిఖీ అధికారి రామరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్య వారి సిబ్బంది కలిసి ఏలూరులో ఉన్న ప్యారడైజ్ రెస్టారెంట్‌పై శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అక్కడ కృత్రిమ రంగులు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాత్రి వండిన ఆహారపదార్థాలను ఫ్రిజ్‌లో దాచి తిరిగి విక్రయిస్తున్నట్టుగా గుర్తించారు. ల్యాబ్ పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరించారు.



చోరీ ఘటనను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ

గోల్డ్‌షాపులో చోరీ

550 గ్రాముల బంగారం, రూ. 60 వేల నగదు అపహరణ

ముసునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలోని ఓ బంగారం దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. వివరాలివి.. స్థానికుడు వంకదారు మల్లికార్జున విఘ్నేశ్వరరావుకు చెందిన బంగారం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి ఐరన్ మెస్, షట్టర్‌కు వేసిన తాళాలను పగులకొట్టి చోరీకి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి యాజమానికి సమాచారం అందించారు. షాపు యజమాని వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వగా చాట్రాయి ఇన్‌చార్జి ఎస్ఐ డి.రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ చోరీలో 550 గ్రాముల బంగారు అభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముసునూరు పోలీసులు తెలిపారు. ఆగంతకుడు పక్కనే ఉన్న మరో మూడు బంగారం దుకాణాల్లో చోరీకి యత్నించాడు. దుకాణాల వద్ద ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెండేళ్ల క్రితం యువతి అదృశ్యం



ముత్యాల పూర్ణశ్రీ (ఫైల్)

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితంలేని ఓ యువతి రెండేళ్ళ క్రితం అదృశ్యమైందని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు పడమరవీధి చేపల చెట్టు సెంటర్ ప్రాంతానికి చెందిన ముత్యాల పూర్ణశ్రీకి మతిస్థిమితం సరిగా ఉండదు. రెండేళ్ళక్రితం ఆమె ఇంటి నుంచి వెళ్ళిపోయింది. అప్పటినుంచి వెతికినప్పటికి ఆచూకీ కానరాలేదు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఆమె సోదరి ముత్యాల దేవి ఫిర్యా దు చేశారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో యువతి అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా కంఠమనేని



సత్యనారాయణను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ తదితరులు

కామవరపుకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివంగత ఘంటా హనుమంతరావు ఎత్తిపోతల పథకానికి చైర్మన్‌గా కంఠమనేని సత్యనారాయణను రైతులు, అధికారులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ సర్పంచ్ ఘంటా సత్యం బాబు మిత్రబృందం సత్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించారు. రైతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి

ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అప్పగించిన వివిధ యాప్‌లలో డేటాను నమోదు చేసేందుకు పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని శుక్రవారం ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో జరిగిన ఏపీటీఎఫ్ నగర శాఖ సమావేశంలో సంఘ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏళ్ళ తరబడి పెండింగ్‌లోవున్న మున్సిపల్ టీచర్ల పీఎఫ్ నెంబర్ల కేటాయింపు ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టాలని కోరారు. మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘ నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు, పొట్టియ్య, ప్రకాష్, శాంతి కుమార్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై సర్వే

ఉంగుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని కసానిగుంట చెర్వు ఆక్రమణకు గురైందని నవంబరు 4న అర్జా బులి వీరా స్వామి అనే వ్యక్తి ఏలూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం సర్వే చేశారు. దీంతో చెర్వు చుట్టూ భూమిని ఆక్రమించిన కొందరు ఆ భూముల్ని అమ్ముకోవడంతో ఆ స్థలాల్లో ఇళ్ళ నిర్మాణం చేపట్టారు. దీంతో ఆక్రమణదారులు, ఇళ్లు నిర్మించుకున్న వారు తమ ఇళ్లను తొలగిస్తారోమోనని ఆందోళన చెందుతున్నారు.

నిర్వాసితుల డిమాండ్లు నెరవేర్చాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.బాబ్జీ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల ఐక్య వేదిక, ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలంలోని చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పోలవరం నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శగా వెళ్లి ఆర్డీవో ఎంవీ రమణకు, టౌన్‌హాల్ వద్ద చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎం.వెంకటస్వామి, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమావేశం

టి.నరసాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈ నెల 30న జరిగే ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ సమావేశంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సిద్దు మాదిగ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల కమిటీల నిర్మాణంలో భాగంగా ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల జిల్లా సమీక్ష సమావేశాలు ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు లో ఉన్న తంగెళ్ళమూడిలో ఇజ్రాయేల్‌పేట కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఎలీషా మాదిగ, ఎం.చిన్నసుబ్బారావు మాదిగలు పాల్గొంటారని తెలిపారు.

బ్యాంకుల్లోనూ ఖాతాలు తెరవొచ్చు

ఏలూరు టూ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరుచుకోవచ్చని నగర కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. పొదుపు ఖాతాలు తెరవడానికి పోస్టాఫీసుల చుట్టూ తిరగనవసరం లేదన్నారు. ఇప్పటికే ఏ బ్యాంకులోనైనా ఖాతాలు ఉన్నవారు జాతీయ చెల్లింపుల సంస్థతో అనుసంధానం చేసుకోవాలన్నారు. పోస్టాఫీసుల్లో కానీ బ్యాంకుల్లో కానీ ఖాతాలు ఉన్నవారు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలన్నారు.

క్రైమ్ కార్నర్

వేర్వేరు కేసుల్లో 38 మద్యం బాటిళ్లు స్వాధీనం

చింతలపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించగా బాదరాల గ్రామానికి చెందిన కాగితపు శంకరరావు అనే వ్యక్తి నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. నాగిరెడ్డిగూడెంలో దారావతు రాజీ అనే మహిళ నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : జగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో అంకన్నగూడెం శివారు దిబ్బగూడెంలో 25 తెలంగాణ మద్యం బాటిళ్లు అక్రమంగా కల్గి ఉన్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మీ, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

● ఏలూరు క్రైం : జిల్లా ఎక్సైజ్ ఎస్పీ ఆవులయ్య ఆదేశాల మేరకు ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐ జీఎస్ కృష్ణధనరాజ్, ఎస్ఐ వై.గౌరీ శంకర్, సిబ్బంది శుక్రవారం రాత్రి దాడి చేశారు. దెందులూరు మండలం పోతునూరుకి చెందిన బొడ్డుపల్లి అరవింద్‌ను అరెస్టు చేసి అతని నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

సిరులు కురిపిస్తున్న జామాయిల్

» టన్ను రూ.7 వేలు పైనే » సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

ఏడాది క్రితం వరకు జామాయిల్ సాగంటే ఆమడదూరం ఉన్న రైతులు ఈ ఏడాది ఎక్కడ భూమి ఉన్న ఆ భూమిలో జామాయిల్ సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం టన్ను జామాయిల్ ధర రూ.7వేలు పైగా పలుకుతుండటమే.



కుక్కునూరు మండలంలో విస్తారంగా సాగవుతున్న జామాయిల్

కుక్కునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి తీర ప్రాంతంలో అధిక దిగుబడి, పండిన పంట, నాణ్యంగా ఉండటంతో పత్తి, మిర్చి పంటలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఈ పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. అయితే ఏటా గోదావరి వరదలు, పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. అలాగే అతివృష్టి, అనావృష్టితో సరిగా పంటలు కూడా పండటం లేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ క్రమంలో జామాయిల్ ధర టన్ను రూ.7 వేలకుపైగా పలుకుతుండడంతో రైతులు ఈ పంటపై దృష్టి సారించారు. వాతావరణ పరిస్థితి ఎలా ఉన్న జామాయిల్ సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే కూలీల కొరత కూడా ఉండదు. ఈ క్రమంలో నాలుగైదేళ్లలో జాగ్రత్తగా సాగు చేస్తే పంట చేతికి వస్తుంది. ఎకరానికి 30 టన్నులకు పైగా దిగుబడి వస్తే ఆశించినంత గిట్టుబాటు ధర ఉంటే రైతులు లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. దీంతో రైతులు మిర్చి, పత్తి సాగును తగ్గించి జామాయిల్ సాగుపై దృష్టి పెట్టారు. ఈ ఏడాది కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 50 లక్షల మొక్కలను ఐటీసీ ద్వారా కొనుగోలు చేసి సాగు ప్రారంభించారు. అలాగే ఏజెన్సీలోని జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, ప్రాంతాల్లో జామాయిల్ సాగు ప్రారంభించారు. దీంతో భూములకు కౌలు ధరలు కూడా పెరిగాయి. గతంలో మెట్ట భూముల్లో ఎకరం రూ.5 వేలు ఉంటే, ప్రస్తుతం రూ.10 వేలకు పైగా పలుకుతోంది. కానీ గోదావరి తీర ప్రాంతంలో ఉన్న నల్లరేగడి భూమిలో కూడా రైతులు జామాయిల్ సాగు ఆరంభించారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తా : సొంగా



ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కలిసిన నిర్వాసిత రైతులు

చింతలపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంతో మాట్లాడి చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హామీ ఇచ్చారు. భూమి ధరలు పెరిగినందున తమకు న్యాయం చేయాలని భూ నిర్వాసిత రైతులు రోషన్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఇది రైతుల సంక్షేమ ప్రభుత్వమని రైతులకు మేలైన ధర అందించాలని తాను అసెంబ్లీలో మాట్లాడడం కూడా జరిగిందన్నారు. ఇప్పటికే కొంతమేర నష్టం జరిగిందని రైతులు చెబుతున్న మాటలు వాస్తవమేనని అయితే ఎవరో చెప్పే మాటలు నమ్మవద్దని, దానివలన రైతులే నష్టపోతారని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. కొందరు దీనిపై పట్టుబట్టితే ఎటూ ఉపయోగం ఉండదని, ప్రభుత్వం ముందుకొచ్చినప్పుడు రైతులు సహకరించాలన్నారు. ఈ పథకం పూర్తయితే రైతులకు, ప్రజలకు, ఈ ప్రాంతవాసులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు కలిసివస్తే ఈ పథకం వేగవంతం చేయడానికి అవకాశం ఉంటుందని ముత్తారెడ్డి పేర్కొన్నారు. నిర్వాసిత పోరాట కమిటీ కార్యదర్శి అంజిబాబు, కె.కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జాబ్ మేళా

జంగారెడ్డిగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో టాలెంట్ కలిగిన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చిట్టూరి గణేశ్వరరావు టౌన్‌హాల్లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేశారు. 219 మంది ఈ ఉద్యోగ మేళాకు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ అనంతరం రెండురోజుల తరువాత సెలక్ట్ అయిన అభ్యర్థులకు నేరుగా ఫోన్‌లు వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు సాయం

స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాలు వద్ద శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు టీడీపీ కార్యకర్త సయ్యద్ అన్వర్‌కు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ రూ.50 వేల అందచేశారు. ఇటీవల పట్టణంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావే శంలో అన్వర్ తన కుటుంబ పరిస్థితిని వివరించి ఎమ్మెల్యేను ఆర్థిక సాయం కోరగా, ఎమ్మెల్యే స్పందించి ఆటో కొనుక్కుని జీవనం సాగించ టానికి తనవంతుగా సయ్యద్‌అన్వర్‌కు రూ.50 వేలు చెక్కును అందచేశారు. టీడీపీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి డీఎస్ చంద్రశేషు, పట్టణ అధ్యక్షుడు ఆర్.కృష్ణ జిల్లా అధికార ప్రతినిధి పి.రామ్‌కుమార్, పి.సత్తిపండు, ఎస్.రామచంద్రరాజు పాల్గొన్నారు.

సస్య రక్షణతో మొక్కజొన్న పంటను కాపాడుకోవచ్చు

పోలవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సస్య రక్షణ చర్యలతో మొక్కజొన్న పంటను కాపాడుకోవచ్చునని డాక్టర్ వైఎస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి రైతులకు సూచించారు. కొండ్రుకోట పునరావాస కాలనీలో రైతులకు మొక్కజొన్న పంటలో ఆశించే కత్తెరి పురుగు నివారణ విధానాలపై శుక్రవారంఅవగాహన కల్పించారు. 15 మంది పునరావాస కాలనీల రైతులకు మొక్కజొన్న పంటలో వాడకానికి పురుగు మందులు ఉచితంగా అందించారు. మొక్కజొన్న పంట పండించే రైతులకు విత్తన శుద్ధి చేసి మందులు, వేపనూనె వాడాలని, లింగాకర్షణ బుట్టలు కత్తెరి పురుగు నివారణకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం గతంలో అందించిన పెరటి కోళ్ళు, మేకల పథకాల అభివృద్ధి పరిశీలించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జి.అనీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం ఫిలోమెన్, ఎంబీ ముక్కయ్య, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో పరిచయాలు వద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వన్ టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచివి కావని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సూచించారు. ఏలూరు కోటదిబ్బమీద ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై, సోషల్ మీడియా మాధ్యమాల్లో జరిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్లు చేసి కేవైసీ అప్‌డేట్ చేయాలని తెలిపి పంపించే ఏపీకే యాప్ ఓపెన్ చేయవద్దన్నారు. అలా చేస్తే ఫోన్‌లో ఉన్న సమాచారం మొత్తం వారు తీసుకుని ఫోన్ హ్యాక్ చేస్తారన్నారు. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అభయ మహిళా రక్షక దళం నిరంతరం గస్తీ నిర్వహిస్తుందన్నారు. వన్ టౌన్ ఎస్ఐ మదీనాభాషా, సైబర్ సెల్ ఎస్ఐ రాజా, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ పోటీలకు మృదుల



మృదులను అభినందిస్తున్న శ్రీవాస్తవ, మోజెస్

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలో డిసెంబరు 20 నుంచి జరిగే సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పోటీలకు దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల విద్యార్థిని ఇ.మృదుల ఎంపికైందని కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు.డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో జరిగిన బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొన్న మృదుల సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మృదులను ఇండోర్ ప్రభుత్వ దంత వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ బీఎం శ్రీవాస్తవ, మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు, పీడీ నల్లయ్య అభినందించారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం : ధర్మరాజు



భువ్వనపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా ఉండి చివరి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రైతులకు భరోసా ఇచ్చారు. భువ్వనపల్లిలో శుక్రవారం ధాన్యం కల్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తేమ శాతం 24 ఉన్నా కూడా కొనుగోలుకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. అనంతరం రైతులతో ధాన్యం కొనుగోలు విధానం, గోనె సంచులు సరఫరా, ధాన్యం సొమ్ముపై వివరాలు తెలుసుకున్నారు. మండల నాయకులు పి.వాసురాజు, జనసేన గ్రామ అధ్యక్షుడు ఎ.అరుణ్‌కుమార్, ఎ.రాంబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, జి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. క్రొవ్విడి గ్రామ శివారు ఉప్పరగూడెంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులను శుక్రవారం ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సీహెచ్. బాసిరాజు జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు వి.ఇంద్రకుమార్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్.లెనిన్ బాబు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే మత పెద్దలపై కూడా చర్యలు

ఉంగుటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపించే మత పెద్దలపై కూడా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ హెచ్చరించారు. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా శుక్రవారం కిషోర బాలికా వికాసం అనే అంశంపై ఎంపీడీవో కార్యాలయంలో అవగాహనా సదస్సు జరిగింది. వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా పోలీసులకు, ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, స్కిల్ డెవెలప్‌మెంట్ కో ఆర్డినేటర్ సురే ష్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం : బాల్య వివాహలను అనుమతించకూడదని ఎంపీడీవో కె.వాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్, వైద్య సిబ్బందికి కిషోరీ బాలికా వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణను కలిసిన శేషు



జంగారెడ్డిగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర విప్‌గా నియమితులైన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తణుకు నియోజకవర్గ పరిశీలకుడు డీఎస్ చంద్రశేషు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు.

పోలవరం ట్రైబల్ వెల్ఫేర్ ఎస్‌డీసీగా కిషోర్

ఏలూరు సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలవరం ట్రైబుల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఐ.కిషోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కిషోర్ ఇప్పటి వరకు పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు.

జాప్యం లేకుండా జనన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి

కుక్కునూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీను శుక్రవారం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అపార్ అనే పేరుతో విద్యార్థులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, ఈ రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆధార్ కార్డులో ఎటువంటి అక్షరం తేడా లేకుండా ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రం కచ్చితంగా తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రత్యేక క్యాంపులు పెట్టి జననధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు అందజేయాలని కోరారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్లో డిసెంబర్ 5 వరకు జరగనున్న 39వ జాతీయ స్థాయి యూత్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఈశ్వర్‌తేజ, కిషోర్‌కుమార్, సోమశేఖర్‌ను ఎంపిక చేసినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీను తెలిపారు. వీరు ఇటీవల జరిగిన 9వ రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారన్నారు.

ఆహారం తయారీపై అవగాహన

టి.నరసాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని బొర్రంపాలెం హైస్కూల్ హెచ్ఎం షేక్ మహ్మద్ ఆలీ అన్నారు. హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ సహకారంతో ఉపాధి ఒకేషనల్ ఉపాధ్యాయులు త్రినాద్ ఆహార తయారీపై అవగాహన కల్పించారు. 9,10, ఇంటర్ విద్యార్థులను స్థానిక బేకరీకి తీసుకెళ్ళి కేకులు, బ్రెడ్, పఫ్‌లు తయారీ విధానం నేర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

ఏలూరు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడం వల్ల ప్రమాదాల నుంచి దూరం కావచ్చని జిల్లా ఉప రవాణా శాఖాధికారి షేక్ ఖరీమ్ అన్నారు. రోడ్డు భద్రతపై ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీ పంలో ఉన్న చైతన్య జూనియర్ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ ఖరీమ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ యజమాని మరణించడం వల్ల ఎన్నో కుటుంబాలు దిక్కులేనివిగా మారాయన్నారు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి తమ వంతు బాధ్యతను చేపట్టాలన్నారు. తమ కుటుంబ పెద్దలకు, చుట్టు ప్రక్కల వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహన తనిఖీ అధికా రులు బి.భీమారావు, జి.ప్రసాదరావు, బి.శేఖర్, మహ్మద్ జమీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సోమేశ్వరునికి చింతమనేని పూజలు



పెదపాడులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని దంపతులు



ఏలూరులో అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న ఎంఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు

పెదపాడు : గ్రామంలోని అతి పురాతన గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, సతీమణి వెంకట రాధారాణి దంపతులు ఏకరుద్రాభిషేక పూజలు శుక్రవారం నిర్వహించారు. పూజల అనంతరం ఆలయానికి ఎమ్మెల్యే చింతమనేని వెండి బిందెను సమర్పించారు.

● ద్వారకాతిరుమల : క్షేత్రపాలకుడు మల్లికార్జునస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన, రాత్రి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. శివదేవుని లింగ స్వరూపానికి లక్షపత్రి పూజ నిర్వహించారు. రాత్రి శివలింగ స్వరూపంలో జ్యోతులను వెలిగించి భక్తులు తమ భక్తిప్రపత్తులను చాటారు.

● పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి భద్రకాళికి, క్షేత్ర పాలకుడు భావన్నారాయణ స్వామిని సుమారు మూడువేల మంది భక్తులు దర్శించుకుని ఉచిత అన్నదాన కార్యక్రమాల్లో 500 మంది భక్తులు పాల్గొన్నట్లు ఈవో తెలిపారు.

● ఏలూరు రూరల్ : ధర్మబేరి ప్రాంగణంలో జనసేన నాయకుడు ఎన్.శేషు ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. ఏలూరు, దెందు లూరు ఎమ్మెల్యే బడేటి చంట, చింతమనేని ప్రభాకర్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : ధన్వంతరి జయంతోత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని పవరుపేట స్టేషన్ రోడ్డులో గల ధన్వంతరి వైద్య భగవాన్ విశ్వరూప మందిరం ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించి అనంతరం హోమాలు నిర్వహించారు.

అన్నాభిషేకం

కార్తీకంలోని మాస శివరాత్రి సందర్భంగా నగరంలోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వరస్వామికి పాలాభిషేక,గాంధీనగర్‌లోని అవిముక్తేశ్వరస్వామి, బావిశెట్టివారిపేటలోని రేవులింగేశ్వరస్వామి, శివనగర్‌లోని మల్లికార్జున స్వామి, మినీ బైపాస్ రోడ్డులోని విశ్వంభరేశ్వరస్వామి ఆలయాల వద్ద అన్నాభిషేకం నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి నాయకులు దుర్గారావు, బి.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివకళ్యాణం

పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద విశాఖ నక్షత్రం సందర్భంగా శివకళ్యాణ మహోత్సవాన్ని నగరానికి చెందిన పి.శ్రీనివాసరావు,విజయలక్ష్మి నాగేశ్వరి దంపతులు జరిపారు. ఈవో డి.శంకరరావు, కృష్ణమోహన్, మిత్రబృందం ఏర్పాట్లు చేశారు.

షష్ఠి ఏర్పాట్లపై సమీక్ష

ఉంగుటూరు : కైకరంలోని శ్రీవల్లీదేవ సేన సహిత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు డిసెంబరు 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లపై ఇన్‌చార్జి తహసీల్దార్ వైవీసీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సమీక్షించారు. సర్పంచ్ ఎస్.గోపి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రజిత వస్త్రానికి వెండి అందచేత

జంగారెడ్డిగూడెం :పట్టణంలోని శ్రీనూకాలమ్మ ఆలయంలో జంగారెడ్డిగూడెంలో ఆర్డీవోగా పని చేసిన వైవీ ప్రసన్నలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి రజిత వస్త్రానికి వెండి సమర్పించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వారణాసికి సైకిల్ యాత్ర

భీమడోలు : రైల్వే గేటు సమీపంలో ఉన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి శివపీఠం స్వాముల్లో ముగ్గురు వారణాసికి సైకిల్ యాత్ర చేపట్టారు. వారణాసి వెళ్తున్న స్వాముల్లో జి.భాస్కరరావు, కాశీవిశ్వనాథం, పి.సాయి ఉన్నారు.

శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

నిడమర్రు : భువ్వనపల్లి ఉమా మర్కేండేయ స్వామి ఆలయం శివనామస్మారణతో మార్మోగింది. శివస్వాములు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. స్వామి దర్శనానికి శ్రీశైలం బయలుదేరారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఏలూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఏలూరు ఎంపీడీవో వి.శ్రీలత తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఏలూరు రూరల్ మండలంలో 5,278 మందికి రూ2 కోట్ల 27 లక్షల 47 వేలు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు శనివారం ఇంటింటికి వెళ్లి పింఛన్ అందచేస్తారని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన షరీఫ్



షరీఫ్‌కు అభినందనలు తెలుపుతున్న ముస్తఫా

జంగారెడ్డిగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు ఎంఏ షరీఫ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ ముస్తఫా, షరీఫ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు పి.కాశీ ఉన్నారు.

పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన సాధ్యపడుతుందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక వెంకటాపురం, శ్రీరామ్‌నగర్‌లో శుక్రవారం దోమల నిర్మూలనపై ర్యాలీ, ఇంటింటా లారా సర్వే కార్యక్రమాలు నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను శుక్రవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఆశ్రం వైద్య కళాశాల అంకాలజిస్టులు శైలజ, సింధు మాట్లాడుతూ రొమ్ము కేన్సర్ లక్షణాలు, ప్రభావితంచేసే కారణాలపై వివరించారు. 40 ఏళ్లు దాటిన మహిళల్లో ఈస్ట్రోజన్ ప్రభావంవల్ల రొమ్ము కేన్సర్ సంభవిస్తుందన్నారు. అలాగు హెచ్ఐవీ నివారణపై జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం(డాప్‌క్యూ) ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రాణాంతక వ్యాధి అన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, రెడ్‌క్రాస్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జీలకర్రగూడెంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

కామవరపుకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఘన చరిత్ర కలిగిన జీలకర్రగూడెం గట్టుపై గల బౌద్ధారామాల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పర్యాటక శాఖా మంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుని ఈ ప్రాంతంలో వనరులు సమకూర్చి పర్యాటకులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏలూరు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం నుంచి నేరుగా బౌద్ధారామాల ప్రాంతానికి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.


అదానీని అరెస్టు చేయాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుంభ కోణాలకు కారకులైన అదానీని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ రాష్ట్ర యువజన కాంగ్రెస్, ఏపీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్.రామారావు, ఏపీ ఇన్‌చార్జి ఎం.నాగిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఏపీ యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీష్ రాయడు మాట్లాడుతూ అదానీకి ప్రధాని మోడీ అండ ఉందన్నారు. ఈవీఎంలు మేనేజ్ చేస్తూ ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు ప్రజలను, ప్రతిపక్షాలను మోసం చేస్తారని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేసాయన్నారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, బి.రామ్‌సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

60 రోజుల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



రిటైర్డ్ జడ్జి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

కొయ్యలగూడెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యలు 60 రోజుల్లో పరిష్కారిస్తామని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. కొయ్యలగూడెం సబ్ స్టేషన్‌లో శుక్రవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదకలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ మోటర్లకు కొత్త కనెక్షన్లు ఇవ్వడం లేదన్నారు. తమ ప్రాంతంలో తరచూ లోఓల్టేజ్ సమస్య తరచూ ఉంటుందని, సమస్య పరిష్కరించాలని గంగన్నగూడెం వాసులు కోరారు. ప్రజలు విద్యుత్ సమస్యలను 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌లో తెలపవచ్చన్నారు. ఈ వేదికలో 23 ఫిర్యాదులు వచ్చాయని జంగారెడ్డిగూడెం డీఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు.ఏఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుందా మీకు..!



నాడు పల్లెల్లో రైతు ఇంట రాజసం..

వ్యవసాయానికి తోడు

నేడు యాంత్రీకరణతో కనుమరుగవుతున్న ఎండ్ల బండ్లు

జోడెడ్ల బండి గుర్తుందా.. నాడు గ్రామాల్లో రైతుల ఇంట ఉండేవి. అప్పట్లో మంచి ఎడ్లజత బండి ఉండటం సామాజిక హోదాగా భావించేవారు. రైతు కుటుంబాలు ఎడ్లను కన్నబిడ్డల్లా, బండిని జాగ్రత్తగా చూసుకునేవారు. పల్లెటూర్లలో ఎడ్ల బండిపై వెళుతూ మంచి అనుభూతిని పొందేవారు. పూర్వం రైతులకు చేదోడుగా ఉన్న ఎడ్ల బండ్లు యాంత్రిక విప్లవంతో కనుమరుగవుతున్నాయని ఆ తరం రైతులు చెబుతున్నారు. పశువుల ఎరువు పొలాలకు తరలించడం,వ్యవసాయ పనుముట్లు సాగు భూముల్లోకి తీసుకువెళ్లేందుకు, పంటలు, వరిగడ్డి ఇళ్ళకు తెచ్చుకోవటానికి ఎడ్లబండ్లనే ఉపయోగించేవారు. ఎడ్లబండి లేకుండా వ్యవసాయం నడిచేది కాదు. ఇంకా పెళ్లిళకు,తీర్ధయాత్రలకు ఎడ్లబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. వీధిలో ఒక ఇంట్లో పెళ్ళి అయితే ఆ వీధిలో ఉండే ఎడ్లబండ్లు అన్నీ కట్టి తంతుకు తమ వంతు సహకారం అందించేవారు. క్షేత్రాలకు వెళ్లాలంటే గూడు కట్టి ఎండ్ల బండ్లను అలంకరించి వాటిలోనే ప్రయాణించేవారు.

ట్రాక్టర్లు వచ్చాక ...బండ్లు మాయం

వ్యవసాయంలోకి ట్రాక్టర్లు వచ్చాక ఎడ్లబండ్లు వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 25 ఏళ్ళ క్రితం వరకు గ్రామాల్లో భూస్వాములకు, పెద్ద రైతులకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. చిన్న రైతులు ఎండ్లబండితోనే వ్యవసాయం చేసుకునేవారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకులు రైతులకు ట్రాక్టర్లు కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో అన్ని ఊర్లలో ట్రాక్టర్ల సంఖ్య బాగా పెరిగింది. వ్యవసాయ పనులన్నిటికి ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. పశు గ్రాసం, కూలీల కొరత, తదితర కారణాల వలన రైతులకు పశుపోషణ భారమైంది. దాదాపు రైతులందరూ పశువులను అమ్మి వ్యవసాయ పనులన్నీ కిరాయి ట్రాక్టర్లతో చేయించుకుంటున్నారు. దీనితో ఎడ్లబండ్లకు కాలం చెల్లుతున్నది. ప్రస్తుతం చాట్రాయి మండలంలోని 18 గ్రామాల్లో కేవలం 10 ఎడ్లబండ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

- చాట్రాయి

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్య పడుతుందని, వివాదాలకు తావులేకుండా ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సీతనపల్లిలో పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ నిధులు రూ.13 లక్షలు గ్రామానికి చెందిన కాజా కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షలు సహకారంతో భవన నిర్మాణం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేస్తామని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం ట్రావెలర్స్ బంగ్లాలో ఎండోమెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ పద్మావతి, కూటమి నేతలు పాల్గొన్నారు.



సీతనపల్లిలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

షష్ఠి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ముదినేపల్లి : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో డిసెంబరు 6 నుంచి 18 వరకు జరగనున్న షష్ఠి కల్యాణోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం కైకలూరులో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని ఆవిష్కరించారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

మండవల్లి : కొల్లేరులో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని అన్నారు. ఇంగిలిపాకలంక, పెనుమాకలంక గ్రామాల్లో పెద ఎడ్లగాడి వరకు ఉన్న రోడ్ల దుస్థితిని శుక్రవారం పరిశీలించారు. కొల్లేరులో రహదారుల అభివృద్ధికి రూ.7.85కోట్లు నిధులతో ప్రతిపాదనలు చేశామని నాలుగు రోజుల్లో పనులు ప్రారంభిస్తారన్నారు.



కన్నులపండువగా స్వామివార్ల కల్యాణం

కైకలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్యామలాంబ ఆలయంలో పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వరస్వామివార్ల శాంతి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాస మహోత్సవాల సందర్భంగా అమ్మవారి కల్యాణ మండపం వద్ద స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లును పర్యవేక్షించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

పది శాతం సెలవుల విధానాన్ని రద్దు చేయాలి

చాట్రాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పది శాతం క్యాజువల్ లీవ్‌ల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.రాము, మైనార్టీ కన్వీనర్ మహబూ, కార్యదర్శి అమరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వంద మంది ఉపాధ్యాయులకు పది మంది మాత్రమే కాజువల్ లీవ్‌లు పెట్టాలని నిబంధన పెట్టడం అన్యాయమని, ఒక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉంటే ఒక టీచర్ లీవ్ పెట్టడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఎఫ్‌ఎల్ఎన్ రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమం రద్దు చేయాలని, అపార్ జనరేట్ విషయంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తొలగించాలని కోరారు.



చాట్రాయిలో ధాన్యం కల్లాలు పరిశీలిస్తున్న ఏవో శివశంకర్

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చాట్రాయి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే సూచనలు కన్పిస్తుండడంతో రైతులు కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని జాగ్రత్త పర్చుకోవాలని ఏవో శివశంకర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం కల్లాలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ధాన్యాన్ని సంచుల్లో నింపుకుని మెరక ప్రాంతాలకు చేర్చి టార్పాలిన్‌లు కప్పుకోవాలని, సంచుల్లో ఉంటే ఆర్ఎస్‌కేల ద్వారా త్వరగా మిలుల్లకు తరలించవచ్చన్నారు. రెండు రోజుల పాటు కోతలు నిలుపుదల చేయడం మంచిదని సూచించారు.

వేగవంతంగా స్మార్ట్ మీటర్ల బిగింపు

ఆగిరిపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఈఈ వీరబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఉన్న అపోహలు నెమ్మదిగా తొలగిపోతున్నాయి. నాలుగు నెలలుగా కమర్షియల్ మీటర్లను మార్పుచేసి స్మార్ట్‌మీటర్లను విద్యుత్ సిబ్బంది బిగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ అంటే ముందు రీఛార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సప్లై చేసే మీటర్లని కానీ ప్రస్తుతం మండలంలో అన్ని మీటర్లను మార్పిడి చేసే వరకు ఆ పద్ధతి తీసుకురావట్లేదని బిల్ జనరేట్ చేయడానికి మనుషులతో పని ఉండదన్నారు. మండలంలో 12వేల మీటర్లు మార్పు చేయాలని సిబ్బందితో త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు వేల్పుచర్లలో పింఛన్ల పంపిణీకి మంత్రి రాక

ముసునూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి శనివారం విచ్చేస్తారని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు మంత్రి పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

లక్ష బిల్వార్చన

ముసునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామికి కార్తీక మాస శివరాత్రి పూజలను శుక్రువారం వైభవంగా నిర్వహించారు. ఏలూరు ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో వేదపండితుల వేద మంత్రోచ్చరణలతో స్వామికి మహన్యా సపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష మారేడు దళములతో బిల్వార్చన, రుద్ర హోమం, జ్యోతి ర్లింగార్చనలను నిర్వహించారు. భక్తులు ధ్వజ స్తంభం, శివలింగం, ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈవో పి.సీతారామయ్య పర్యవేక్షణలో ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు భక్తులకు చక్కెర పొంగలి, కట్టు పొంగలి, కదంబం ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ముదినేపల్లి మండలం చినకామనపూడి శివాలయంలో శుక్రవారం లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కమ్మిలి విఠల్ రావు తదితరులు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం ఎలిమెంటరీ పాఠశాలలో సర్పంచ్ తన భార్య జ్ఞాపకార్థం విద్యార్థుల వసతికి నిర్మించిన మధ్యాహ్న భోజన పథకం హాలును పిన్నమనేని, కమ్మిలి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవానికి హాజరైన మాజీ మంత్రి పిన్నమనేని, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి

జగన్ బొమ్మలు త్వరితగతిన తొలగించాలి : ఆర్డీవో

కలిదిండి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భూ రీ సర్వే రాళ్లపై జగన్ బొమ్మలను త్వరితగతిన తొలగించాలని ఆర్డీవో అచ్యుతా అంబరీష్ అన్నారు. శుక్రవారం పోతుమర్రులో భూ రీ సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సర్వే రాళ్ల అన్నింటి పైన జగన్ బొమ్మతో పాటు పేర్లను తొలగించాలన్నారు. అనంతరం వెంకటాపురంలో రైసుమిల్లును సందర్శించి ధాన్యం బస్తాలను పరిశీలించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ మహమ్మద్ షమీ, వీఆర్వోలు పాల్గొన్నారు.



పోతుమర్రులో రీ సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపును పరిశీలిస్తున్న ఆర్డీవో

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : డీఎస్పీ

నూజివీడు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వర్తక, వ్యాపార సంస్థల ప్రతినిధులు తమ వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన ప్రదేశాల్లో విధిగా నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆదేశించారు. నూజివీడు పట్టణంలోని వర్తక, వ్యాపార సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా నేర అన్వేషణ సులువతుందన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐ సత్య శ్రీనివాస్, ఎస్ఐ జ్యోతిబస్సు, చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు పగడాల సత్యనారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ ప్రసాద్

ఎన్‌పీటీఈఎల్ కోర్సుల నిర్వహణకు ఒప్పందం

నూజివీడు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల విద్యార్థులకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) కోర్సుల అమలుకు ఐఐటీ మద్రాసుతో ఆర్జీయుకేటీ అవగాహన ఒప్పందం కుదురింది. ఐఐటీ మద్రాసుకు సంబంధించి ఫీజుల సడలింపు స్థానికంగా పరీక్ష కేంద్రం ఏర్పాటుకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ ఐఐటీ బృందాన్ని అభ్యర్థించారు. యూనివర్సిటీని సందర్శించిన ఐఐటీ బృందం దీనిపై సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా యూనివర్సిటీలో బోధన కొరతను పరిరక్షించడంతో పాటు బోధనలో నాణ్యతను తీసుకువచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.శ్యామ్, యూనివర్సిటీ అధికారులు డి.శ్రావణి, బండి ప్రసాద్, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ఐఐటీ ప్రతినిధులతో ఆర్జీయుకేటీ అధికారులు

పొగాకు పంట విస్తీర్ణాన్ని రైతులు తగ్గించాలి

ముసునూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగాకు పంట విస్తీర్ణాన్ని సాధ్యమైనంత వరకు రైతులు తగ్గించుకోవాలని నూజివీడు సహాయ వ్యవసాయ సంచాలకుడు జి.విద్యాసాగర్ సూచించారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై శుక్రవారం ముసునూరు, గోపవరం గ్రామాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు సాగును తగ్గించడం వల్ల క్యాన్సర్ మరణాల రేటు తగ్గుతుందన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ప్రత్తి, వేరుశనగ, అపరాలు, నువ్వులు తదితర పంటలను రైతులు సాగుచేసు కోవాలన్నారు. ఈ పంటల సాగు ఖర్చు తక్కు వగా ఉండడంతో పాటు ఖర్చు, ప్రయోజనం నిష్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. విత్తన మొక్కజొన్న పండించే రైతులు ఆయా కంపెనీల నుంచి తప్పనిసరిగా అగ్రిమెంట్ పొందాలన్నారు. ఏవో ఎస్.మధు మోహన్, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ విద్యాసాగర్

మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపాలి

ఆగిరిపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజరు గొల్లమూడి శేఖర్‌బాబు సూచించారు. ఆగిరిపల్లి మండలంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని ఈదర సెక్టార్ అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మాదకద్ర వ్యాల సోషల్ మీడియా దుర్వినియోగంపై శుక్రవారం వర్క్ షాప నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూదం, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైన విద్యార్థులకు నూజివీడు మండలం పోలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కోడి ఎడిక్షన్ కేంద్రాన్ని 94904 92020లో సంప్రదించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.రాగమయి, మానసిక వికాస్ కేంద్రం జోనల్ కో-ఆర్డినేట ర్ డి.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్యాంకుల్లోనూ ఖాతాలు తెరవొచ్చు

ఏలూరు టూ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరుచుకోవచ్చని నగర కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. ఇప్పటికే ఏ బ్యాంకు లోనైనా ఖాతాలు ఉన్నవారు జాతీయ చెల్లింపుల సంస్థతో అనుసంధానం చేసుకోవాలన్నారు. పోస్టాఫీసు, బ్యాంకు ఖాతా ఉన్నవారు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలన్నారు.

స్పోర్ట్స్ కాలమ్



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

ఉత్సాహంగా ఏపీఆర్‌జేసీ క్రీడలు

పెదవేగి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల(ఏపీఆర్‌జేసీ) రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం రెండోరోజు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన వారు రాష్ట్ర జట్లకు ఎంపికవుతారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. క్రీడా పోటీలను ఏపీఆర్‌జేసీ స్పోర్ట్స్ అధికారి కె.జయరాజు, ఏలూరు జిల్లా సమన్వయాధికారిణి ఎస్.భారతి, సంస్థ ఏఎంవో ఎన్.సంజీవరావులు పర్యవేక్షించారు.

బాలికల జూనియర్స్ విజేతలు

100మీటర్ల పరుగు: పి.భావన, జోన్ 3, ప్రథమ, వై.రాజీ, జోన్ -4, ద్వితీయ స్థానం పొందారు. 200 మీటర్ల పరుగు: వి.భవ్య, జోన్ -4, వి.వెంకటలక్ష్మి, జోన్ -1, ప్రథమ, బి.ప్రీతిక, జోన్ -2 ద్వితీయ, 400 మీటర్ల పరుగు: కె.అశ్వని, జోన్-4 ప్రథమ, కె.తనూజ, జోన్ 3, ద్వితీయ, 800 మీటర్ల పరుగు: కె.అశ్వని, జోన్-4 ప్రథమ, సీహెచ్.అమూల్య, జోన్- 3 ద్వితీయ, 1500 మీటర్ల పరుగు: కె.అశ్వని, జోన్-4 ప్రథమ, ఎస్.పావని, జోన్- 1 ద్వితీయ, డిస్కస్ త్రో : పి.కృష్ణ శ్రీ జోన్- 2 ప్రథమ, వి.స్వప్న ద్వితీయ, జావెలిన్ త్రో : కె.శ్రావ్య, జోన్- 3 ప్రథమ, ఆర్.శ్రుజ జోన్- 1 ద్వితీయస్థానాల్లో నిలిచారు. లాంగ్ జంప్ : ఎన్.కావ్య, జోన్ -4 ప్రథమ, వై.రమ్యశ్రీ ద్వితీయ, హైజంప్ : వి.సులక్షణ, జోన్-3, ప్రథమ, జి.సాయివర్ష ద్వితీయ, షాట్ పుట్ : ఎం.స్నేహ జోన్-4 ప్రథమ, ఎస్.కోవెల జోన్- 4, ద్వితీయస్థానంలో నిలిచారు.

బాలికల సీనియర్స్

100మీటర్ల పరుగు: డి.చిద్విలాసిని, ప్రథమ, వి.పరిమళ, జోన్-1 ద్వితీయ, 200 మీటర్ల పరుగు: వి.పరిమళ జోన్-3 ప్రథమ, వి.భార్గవి, జోన్-1 ద్వితీయస్థానంలో నిలిచారు. 400మీటర్ల పరుగు: జి.సౌమ్య జోన్-1 ప్రథమ, వి.పరిమళ జోన్-4, ద్వితీయ, 800 మీటర్ల పరుగు: పి.నవీన జోన్-4 ప్రథమ, వై.సుధ జోన్-3 ద్వితీయ, 1500 మీటర్ల పరుగు: పి.నవీన జోన్-4, ప్రథమ, వై.సుధ జోన్- 3 ద్వితీయ, డిస్కస్ త్రో: నిర్మలజ్యోతి, జోన్-4 ప్రథమ, కె.లావణ్య జోన్ -4, ద్వితీయ, జావెలిన్ త్రో: ఏ.లక్ష్మి, జోన్-1 ప్రథమ, పి.కౌసల్య జోన్-3, ద్వితీయ, లాంగ్‌జంప్: డి.చిద్విలాసిని జోన్-4 ప్రథమ, ఎ.విజయలక్ష్మి జోన్-3 ద్వితీయ, హైజంప్: బి.విజయలక్ష్మి జోన్-2, కె.సౌజన్య జోన్-1 ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. షాట్‌పుట్: వి.నిఖిత, జోన్-2 ప్రథమ, ఎస్.వాసవి జోన్-1 ద్వితీయస్థానాలు సాధించారు.

బాలికల జూనియర్స్ - గేమ్స్

కబడ్డీ: లక్కిరెడ్డిపల్లి జట్టు, జోన్-4, ప్రథమ, బీమిలి జట్టు జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. వాలీబాల్: పి.వెంకటాపురం జోన్ 2 ప్రథమ, పోలసానిపల్లి జోన్-2 ద్వితీయ, త్రోబాల్: సింగరాయకొండ, జోన్-3 ప్రథమ, పోలసానిపల్లి జోన్-2 ద్వితీయ, చెస్: ఎస్.రూపశ్రీ జోన్-4 వీబీఎస్ఎస్.సాహితి, జోన్ - 2 ప్రథమ, ద్వితీయ, క్యారమ్స్: నాగులపాలెం జట్టు జోన్-3ప్రథమ, తునిజట్టు జోన్-2, ద్వితీయ స్థానం సాధించారు.

బాలికల సీనియర్స్

కబడ్డీ: లక్కిరెడ్డిపల్లి జట్టు జోన్-4 ప్రథమ, సంఘం జట్టు జోన్-3 ద్వితీయస్థానం సాధించారు. వాలీబాల్: సింగరాయకొండ జట్టు జోన్- 3 ప్రథమ, గరుగుబిల్లి జట్టు జోన్- 1 ద్వితీయ, త్రోబాల్: పోలసానిపల్లి జోన్-2 ప్రథమ, కురుగుంట జోన్ -4 ద్వితీయ, చెస్: జి.సుష్మ, జోన్-2 ప్రథమ, టి.కృపాకుమారి జోన్-4 ద్వితీయ, క్యారమ్స్: మేఘడిగడ్డ, జోన్-1 ప్రథమ, వీరపనేని గూడెం జోన్- 2 ద్వితీయస్థానాల్లో నిలిచాయి.

బాలుర జూనియర్స్ - గేమ్స్

చెస్: ఎ.చరణ్‌కుమార్ జోన్-4 ప్రథమ, ఎస్.వరుణ్, జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. క్యారమ్స్: విశాఖ జట్టు జోన్-3 ప్రథమ, పాలకొండ జట్టు జోన్-1 ద్వితీయ.

సీనియర్స్ విభాగం

చెస్: పి.అభిషేక్, జోన్ -1 ప్రథమ, వి.శ్రవంత్ జోన్ -4 ద్వితీయస్థానంలో నిలిచారు. క్యారమ్స్: కోట జట్టు జోన్ -3 ప్రథమ, నబ్బవరం జట్టు జోన్ -1 ద్వితీయ స్థానం సాధించారు.

జూనియర్ స్పోర్ట్స్

100మీటర్ల పరుగు: జి.నరేంద్రకుమార్, జోన్-3 ప్రథమ, కేవీ.చరణ్, జోన్-4 ద్వితీయస్థానంలో నిలిచారు. 200మీటర్ల పరుగు: జి.లోకేష్ జోన్ -2 ప్రథమ, జి.నవీన్ జోన్- 4 ద్వితీయ, 400మీటర్ల పరుగు: జి.లోకేష్, జోన్- 2 ప్రథమ, జి.నవీన్, జోన్-4 ద్వితీయ, 800మీటర్ల పరుగు: కె.శ్రీకాంత్ రెడ్డి, జోన్ 4 ప్రథమ, జి.లోకేష్, జోన్- 2 ద్వితీయ, 1500మీటర్ల పరుగు: సి.యశ్వంత్, జోన్- 4 ప్రథమ, టి.నవీన్‌కుమార్, జోన్- 3 ద్వితీయ, డిస్కస్‌త్రో: ఎం.అజిత్ జోన్ -4 ప్రథమ, పి.హర్ష, జోన్ -1 ద్వితీయ, జావెలిన్ త్రో: జి.నరేంద్రకుమార్ జోన్-3 ప్రథమ, సీహెచ్.క్రాంతికుమార్ జోన్- 2 ద్వితీయ, లాంగ్‌జంప్: జి.నరేంద్రకుమార్ జోన్-3 ప్రథమ, ఎం.మంజిత్‌కుమార్ జోన్-4 ద్వితీయ, హైజంప్: బి.స్రుజన్, జోన్- 3 ప్రథమ, కె.వేణు, జోన్ -4 ద్వితీయ షాట్‌పుట్: ఎం.అజిత్‌నాయక్, జోన్-4 ప్రథమ, కె.చరణ్‌తేజ జోన్ -2 ద్వితీయ స్థానాలు సాధించారు.

బాలుర సీనియర్స్

100మీటర్ల పరుగు: జి.జశ్వంత్, జోన్-4 ప్రథమ, వై.సుబ్రహ్మణ్యం, జోన్-3, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 200మీటర్ల పరుగు: పి.సాయికుమార్, జోన్- 4 ప్రథమ, బి.చందు, జోన్- 4 ద్వితీయ, 400మీటర్ల పరుగు: డి.సందీప్, జోన్- 4 ప్రథమ, పి.సతీష్, జోన్ -3 ద్వితీయ, 800మీటర్ల పరుగు: డి.సందీప్, జోన్- 4 ప్రథమ, కె.వంశీ, జోన్ -2 ద్వితీయ, 1500మీటర్ల పరుగు: ఇ.విద్యాసాగర్, జోన్-4 ప్రథమ, పి.లక్ష్మీనారాయణ, జోన్ 4 ద్వితీయ, డిస్కస్ త్రో: సీహెచ్.అభి, జోన్ -1 టి.భరత్ కుమార్ జోన్- 4 ప్రథమ, ద్వితీయ, జావెలిన్‌త్రో: జి.జశ్వంత్, జోన్- 3, ఎస్.నతీష్‌కుమార్, జోన్- 3 ప్రథమ, ద్వితీయ, లాంగ్‌జంప్: పి.హరీష్, జోన్-2, వై.దినేష్, జోన్-4 ప్రథమ, ద్వితీయ, హైజంప్: టి.చరణ్‌తేజ, జోన్-3, బి.జగదీష్, జోన్-4 ద్వితీయ, షాట్‌పుట్: సీహెచ్.అభి, జోన్-1 జే.రోహిత్, వి.గణేష్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు.

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. మండలంలో 8,888 పెన్షనర్లకు రూ.3.72 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం మృతి



సుబ్రహ్మణ్యం

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వడాలికి చెందిన గురువు సుబ్రహ్మణ్యం శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. 1983 నుంచి సుబ్రహ్మణ్యం తెలుగుదేశం పార్టీలో క్రియా శీలకంగా వ్యవహరిస్తూ, కలిదిండి ఏఎంసీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ రైతుగా రెండు సార్లు అవార్డులు అందుకున్నారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వినోద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జగన్మోహనరావు, సంతాపం తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

కైకలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ వై.శ్రీలత అన్నారు. ఎయిడ్స్ డేను పురస్కరించుకుని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎయిడ్స్‌డే రోజున బహుమతులు అందజేస్తారు. రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ కె.రమేష్ పాల్గొన్నారు.

ములకలపల్లి సర్పంచ్ మృతికి సంతాపం

ముదినేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి పంచాయతీ సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. గుండెపోటుకు గురై గురువారం మృతి చెందిన సర్పంచ్ కోటేశ్వరరావు అంత్య క్రియలు శుక్రవారం జరిగాయి. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, ఎంపీపీ సత్యనారాయణ, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సుందర రామయ్య తదితరులు సంతాపం తెలిపారు.

డివిజన్ పరిధిలో 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

నూజివీడు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూజివీడు డివిజన్ పరిధిలో 11,579 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 22,796 ఎకరాల్లో వరి ధాన్యాన్ని సాగు చేయగా ఇంకా 11 వేల ఎకరాల్లో వరి కోత దశలోనే ఉందన్నారు. కళ్లాల్లో 1,536 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా దాన్ని త్వరితగతిన సేకరించి మిల్లర్లకు పంపే చర్యలు చేపడుతున్నామన్నారు.



చోరీ ఘటనను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ

రమణక్కపేట గోల్డ్‌షాపులో చోరీ

550 గ్రాముల బంగారం, రూ. 60 వేల నగదు అపహరణ

ముసునూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలోని ఓ బంగారం దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. వివరాలివి.. స్థానికుడు వంకదారు మల్లికార్జున విఘ్నేశ్వర రావుకు చెందిన బంగారం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి ఐరన్ మెస్, షట్టర్‌కు వేసిన తాళాలను పగులకొట్టి చోరీకి పాల్పడ్డాడు. శుక్రువారం ఉదయం స్థానికులు గమనించి యాజమానికి సమాచారం అందించారు. షాపు యజమాని వచ్చి పరిశీలించి పోలీసుల కు సమాచారం ఇవ్వగా చాట్రాయి ఇన్‌చార్జి ఎస్ఐ డి.రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ చోరీలో 550 గ్రాముల బంగారు అభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముసునూరు పోలీసులు తెలిపారు. అగంతకుడు పక్కనే ఉన్న మరో మూడు బంగారం దుకాణాల్లో చోరీకి యత్నించాడు. దుకాణాల వద్ద ఉన్న సీసీ ఫుటేజి ఆధారంగా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.